


# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

అక్టోబర్ 2019

సంపుటి : 25 **298** సంచిక : 10




# పాలకుడు సర్వవిద్యాకుశలుడుగా ఉండాలి!

పాలకుడూ లేదా పాలకులు సర్వ విద్యాకుశలురుగా ఉన్నప్పుడే, పాలితులయిన ప్రజలు, సంస్కృతీ, సాహితీ సాంప్రదాయ సంపద లతో వర్ధిల్ల కలుగుతారు. భాష వర్ధిల్లుతుంది, భావన ప్రవర్ధిల్లు తుంది. భాషణంలో ప్రౌఢత్వం కలుగుతుంది.

**సర్వ విద్యాను కుశలో నృపో హ్యపిసుమంత్ర విత్**

**మంత్రి భిస్తు వినామంత్రం నైకోర్వం చింతయేత్ క్వచిత్**

అన్న సైద్ధాంతికంగా పాలకుడు లేదా పాలకు పాలనాకుశులే కాదు, ఇంద్రియ నిగ్రహం వంతులుగా ఉండాలి. ఇంద్రియానుగ్రహం కారణంగా బుద్ధిబలం పెరుగుతుంది. బుద్ధిబలం బాహుబలం కన్నా గొప్పది. గజబలం, అశ్విక బలం, కాల్బలములు చేయలేని కార్యాన్ని ఒక పాలకుని సునిశిత మేధస్సు చేస్తోంది.

దురదృష్టమేమంటే తెలుగు సారస్వతంలో సారస్వత భాషలోని మాధుర్యత, తెలుగు సాంప్రదాయ సదాచారం చ(చె)విగొనని నాయకులు శాసనసభల్లోనూ బహిరంగ సభ గద్దెల్లోనూ మిద్దెలెగిరే గద్దుగళంతో ఎగరడం, సన్నాసీ, శుంఠలనే భాషణములు వాడడం, వాటిని పత్రికల్లో, టీ.వి.ల్లో లీవిగా ప్రసారం చేయడం చూస్తూంటే – నాయకులెంత బుద్ధి తప్పిపోయారా – అనిపిస్తోంది. నాయక ప్రౌడిమకూ, నాయక గరిమకూ, నాయక ప్రౌఢత్వానికీ, మేధోశీలజ్ఞతకూ తెలుగువారు గొప్పవారనీ, త్యాగమూర్తులనీ, ధర్మమూర్తులనీ పొందిన పేరు ఇప్పుడు భ్రష్టు పట్టిపోతూంది. ప్రతివానికీ పదవే పరమావధిగా కనిపిస్తూంది.

**'ప్రజ్ఞాచ కౌల్యంచ దమః శ్రుతంత పరాక్రమశ్చ**

**బహుభాషాతాచ, దానం యధాశక్తి, కృతజ్ఞతాచ'**


అను లక్షణాలు నాయకులకు తప్పనిసరిగా ఉండాలన్న 'విదురనీతి' ఏ దిశకు ఏగిందో తెలియడం లేదు.

**విజ్ఞాతదోషేషు దధాతిదండమే**

**'కించిత్ క్షమతే వివాదం'** అన్న నీతులు బూజు పట్టిపోయాయి. దోషులనూ, ద్రోహులనూ శిక్షించడం, సదా విరోధం ప్రకటించేవాడిని క్షమించడం నేరం. మన అదృష్టవశాత్తూ చాణక్యుడు, విదురుడు, శుక్రుడు – వంటి నీతిజ్ఞులు ఎన్నో ధర్మాలను సూచించారు. నీతిభ్రష్టు ప్రస్తానం ఎలా పరిణమించిందో చెప్పారు. మాతృభాషలో ఈ గ్రంథాలు విరివిగా రాకపోవడం, వచ్చినా చదవక పోవడం, చదివినా ఆచరించక పోవడంతో నేటి చరిత్ర, సంస్కృతి, సాంప్ర దాయం చట్టుబారిపోతూంది.

ఎంతో ప్రాచీనమైన తెలుగుభాష సంస్కృతంతో సమంగా సంస్కృతిని పంచింది. జాతీయంగా, శిరమున దాల్చవలసిన తెలుగు, వివక్షతకు గురి అయింది. శ్రీరామచంద్రుని తల్లి కౌసల్య తెలుగు ఆడపడుచు అయితే ఏంవి లాభం, విశ్వామిత్రుని సంతతిలో తెలుగువారున్నారంటే ఏంవి లాభం – జర్మనీవాళ్లు, వాళ్ల దేశంలో తెలుగు అచ్చులను గొనిపోయి 'బైబిల్'ను అక్కడే ముద్రించుకున్నారంటే – ఏంవి లాభం? బ్రౌను దొర తెలుగు మాధుర్యాన్ని హృదయానికి హత్తుకుని అంత సేవ చేశాడంటే ఏం లాభం?

ప్రముఖ తమిళ కవులు భారతీయార్ సుందర తెలుంగు అన్నారంటే ఏంవి లాభం – జాతిపిత మహాత్మాగాంధీ పట్టాభిసీతారామయ్యగార్కి తన సలహాదారు నిగా పి.వి. నరసింహారావుగారి సేవలను వినియోగించుకున్నారన్నా ఏంవి లాభం? వేదకాలం నుంచీ ఉన్న సంస్కృతం కూడా తమిళం తరువాతనే జాతీయ భాషగా పేర్కొనబడింది. బ్రిటిష్ వారి కాలంలో రూపాయి నాణాలపై ముఖ్యంగా ఉన్న తెలుగు తెలియరాలేదు. ఇలాటప్పుడు 'తెలుగువారి ఆత్మ గౌరవం' గురించీ మాట్లాడే అధికారం ఏ రాజకీయ నాయకునికీ లేదనడంలో న్యాయముంది ఏమో! కృష్ణాజిల్లా రచయితల సంఘం శ్రద్ధబూని, ఓ యాభై మంది శాస్త్రజ్ఞులతో రెండు రోజుల సమావేశం జరిపి, మూడు నాలుగు వేల సంవత్సరాలకు పూర్వమే తెలుగు సారస్వతం ఉన్నదనీ, నన్నయ్యతోనే లెఖ్ఖలు గట్టడం సరికాదనీ నిర్ధారించారు. తెలుగు పెద్దలకు కనువిప్పు కలిగించారు. ఇప్పటికైనా పాలకుల తీరు మారి, సర్వ విద్యా కుశలురనిపిస్తా రని విశ్వసిస్తున్నాను. జై తెలుగు!




*బుధజన విధేయుడు*

***– గోటేటి శ్రీరామారావు***

**(మార్చి 2008, ప్రముఖాంధ్ర)**


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**




# గురుభక్తి

గురువు అనగానే 'గురుభక్తి'.

గురువు అనగానే అందరూ చెప్పే మొట్టమొదటి శ్లోకం :

**"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః**
**గురు స్సాక్షాత్పర బ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః"**

అయితే ఈ శ్లోకం ఎందులోనిది?

ఏ సందర్భంలోనిది?

ఎవరు వ్రాశారు? వంటి సందేహాలు ఎవరికయినా ఎప్పుడయినా వచ్చాయా?

ఈ శ్లోకం వెనుక అత్యంత ఆసక్తికరమయిన కథ ఉంది. ఈ కథ ఇంతకు ముందు తెలిసినవారు మళ్ళీ చదివేయండి, తెలియని వాళ్ళు శ్రద్ధగా చదవండి

కొనేళ్ళ క్రిందట గురుకులాలు ఉండేవి. అలా ఒకానొక గురుకుల ఆశ్రమంలో ఒక గురువుగారు ఉండేవారు ఆయన పేరు వేద ధర్ముడు. ఆయన సర్వశాస్త్ర కోవిదుడు, జ్యోతిష్య శాస్త్రంలో దిట్ట. ఈయన ఎందఱో పిల్లలని చేరదీసి, ఆయన వద్దే ఉంచుకుని, భోజనం పెట్టి, ఆశ్రయం కల్పించి ఆయనకొచ్చిన విద్యలన్నిటినీ నిస్వార్ధంగా బోధిస్తూ ఉండేవారు. అలా ఈయన వద్ద కౌత్సుడు అని ఒక శిష్యుడు ఎంతో గురుభక్తితో ఉంటూ, విద్యను అభ్యసిస్తూ తను కూడా జ్యోతిష్య శాస్త్రంలో పట్టు సాధించాడు. చదువు ముగిసినపిదప శిష్యులంతా స్నాతక సభ (మన గ్రాడ్యుయేషన్ వంటిదనుకోండి) ముగించుకుని గురువుని, ఆశ్రమాన్ని వదిలి వెళ్ళిపోయేవారు. అలా కౌత్సుని విద్య కూడా చివరికి వచ్చేసిన సందర్భంలో ఒక సారి గురువుగారు ఏదో పని మీద ఊరు వెళుతూ ఆశ్రమ బాధ్యతలన్నిటినీ కౌత్సునికి అప్పగించి వెళతారు. ఆయన తిరిగివచ్చేసరికి ఆయన లేని లోటు లేకుండా అన్నీ యధావిధిగా జరుగుతుండటం చూసి సంతృప్తితో ఆనందిస్తారు గురువుగారు.

ఇదిలా ఉండగా, స్నాతక సభ జరిగే రోజు రానే వచ్చింది. అందరూ గురువుగారితో తమకున్న అనుబంధాన్ని చెప్పుకుని, ఆయన వద్ద ఆశీర్వచనాలు తీసుకుని తమ తల్లిదండ్రులతో తమ తమ ఇళ్ళకు వెళిపోయారు. ఈ కౌత్సుడు మాత్రం నోరు మెదపలేదు, తల్లి దండ్రులు ఎంత బ్రతిమాలినా వాళ్ళతో వెళ్ళడానికి విముఖత చూపించాడు. చేసేది లేక అతని తల్లిదండ్రులు వెళిపోతారు. గురువుగారు ఇతనిని పిలిచి తను మాత్రం వెళ్లకపోవడానికి కారణమేమిటని అడుగుతాడు. అప్పుడు కౌత్సుడు బోరున విలపిస్తూ "గురువుగారూ! మీరు పొరుగూరు వెళ్ళినప్పుడు మీరు నేర్పిన జ్యోతిష్య విద్యతో మీ జాతకం చూశాను, ఈ కార్తీక మాసం (పదిహేను రోజుల్లో) నుండి తమకి దారుణమయిన కుష్ఠురోగం రాబోతోందని మీ గ్రహస్థితి చెబుతోంది. నాకు చదువు నేర్పించి, తిండి పెట్టిన మిమ్మల్ని కష్టమయిన కాలంలో వదిలి వెళ్ళలేను. కనుక మీతోనే ఉండి సేవలు చేసి మీరు ఆరోగ్యవంతులు అయిన తరువాతే వెళతాను, అప్పటిదాకా మిమ్మల్ని వదిలిపోను" అంటాడు. అది విన్న గురువుగారు ఆశ్చర్యం, ఆనందం, దుఃఖం అన్నిటినీ కలగలిపిన ఒక అనుభూతితో ఆనంద భాష్పాలు రాలుస్తారు.

కౌత్సుడు మాత్రం గురువుగారికి ఆ వ్యాధి రాకుండా ఏమేం చేయాలో ఆలోచించి గురువు గారితో ఫలానా జపాలు, పూజలు, యాగాలు చేద్దాం, తద్వారా మీకు రోగం రాదు అంటాడు. దానికి గురువుగారు "ప్రారబ్ధం భోగతో నస్యేత్" అన్నట్టుగా ప్రారబ్ధం అన్నది ఎప్పుడయినా అనుభవించాల్సిందే కనుక ఇప్పుడు అనుభవించి నేను విముక్తుడిని అవుతున్నాను అన్న ఆనందముతో ఉన్నాను కనుక నువ్వు బాధపడకు అంటాడు. అప్పుడు గురువుగారి మాటను కాదనలేక, కాశీలో పాపం చేసినా పుణ్యం చేసినా రెట్టింపు ఫలం వస్తుంది అంటారు కనుక మనం అక్కడకి వెళ్ళి పుణ్య కార్యాలు చేద్దాం తద్వారా మీరు త్వరగా కోలుకుంటారు అంటాడు. సరేనని ఇద్దరూ అక్కడకి ప్రయాణమవుతారు. కాశీ వెళ్ళిన తరువాత అక్కడ విద్యాదానం చేయటం, శివపంచాక్షరీ మంత్ర జపం చేయించటం, చేతనయినంతలో ఇతరులకి సహాయ సహకారాలు చేయటం, ఇలా ఎన్నెన్నో మొదలు పెట్టాడు కౌత్సుడు. మిట్టమధ్యాహ్నం కాళ్ళకి చెప్పులు లేకుండా జోలె పట్టుకుని (భిక్ష ద్వారా వచ్చినది మాత్రమే తినేవారు) తిరిగి అన్నాన్ని తెచ్చి గురువుగారికి పెట్టి, తను తినేవాడు. ఒక్కోసారి గురువుగారు ఆయన తినక, తినని తిననీయక అన్నాన్ని విసిరేసేవారు. చీటికీ మాటికీ కౌత్సుడిని కొట్టడం, తిట్టడం చేయటం, చీదరించుకోవటం వంటివి చేసేవారు. అయినా కూడా ఎక్కడా విసుక్కోకుండా గురువుగారికి వ్యాధి ముదిరి మరింత బాధపెడుతోంది కాబోలు పల్లెత్తు మాట అనని ఈయన ఇలా ప్రవర్తించడానికి కారణం అదే అనుకుంటూ మరింత సేవలు చేసేవాడు. కౌత్సుడి గురుభక్తిని గమనిస్తున్న బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒక పందెం వేసుకున్నారు, "మన ముగ్గురిలో ఎవరు కౌత్సుడిని గురువుగారి వద్దనుండి పంపుతారో వారే మనలో గొప్పవారు" అని.

ఇక్కడ మనం గమనించాల్సిన ముఖ్య విషయం, గురువుగారిని ఇబ్బంది పెట్టి ఆనందించడం దేవుళ్ళ లక్ష్యం కాదు, కౌత్సుడు భగవంతుడు పరీక్షలు పెట్టే స్థాయికి చేరుకున్నాడు. సరే, అనుకున్నట్టుగా ముందుగా బ్రహ్మ మారు వేషంలో వచ్చి "నువ్వు కాశీ వచ్చినప్పటి నుండీ చూస్తున్నాను, ఎందుకాయన దగ్గర అన్ని మాటలు పడుతూ ఉంటావు, పెద్ద వాడిని చెప్తున్నాను, నా మాట విని వేరే గురువుని చూసుకుని వెళ్ళిపో" అంటాడు. దానికి కౌత్సుడు "గురువుని, అదీ ఇటువంటి పరిస్థితుల్లో బాధపడుతున్న ఆయనని వదిలేయమని చెప్తున్న మీరు పెద్దవారెలా అవుతారు? మీరు మా గురువుగారి పరిస్థితుల్లో ఉంటే శిష్యుడు వదిలి వెళ్ళిపోవాలనే అనుకుంటారా?" అనేసరికి బ్రహ్మ నోట మాట రాక వెళ్ళిపోతాడు. తదుపరి విష్ణువు మారు వేషంలో వచ్చి "రోగముతో ఉన్న గురువుగారికి సేవ చేస్తున్నందుకు నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను, కానీ చేసిన మేలు మరిచే కృతఘ్నునికి సేవ చేస్తే పాపం కూడా వస్తుంది కనుక ఆయనని వదిలి వెళ్ళిపో" అంటాడు. దానికి కౌత్సుడు "కృతఘ్నుత అన్నది ఏదయినా ఉంటే ఇటువంటి సమయములో వదిలి వెళిపోతే నాదవుతుంది కానీ నన్ను చేరదీసి, భోజనం పెట్టి, నా నుండీ ఏమీ ఆశించకుండా తన విద్వత్తునంతా ధారపోసిన ఆయనది కాదు" అనేసరికి విష్ణువు వెను తిరుగుతాడు. ఇహ ఈశ్వరుడు మారు వేషములో వెళ్ళి "మానవ సేవే మాధవ సేవ అన్న మాట వాస్తవమే కానీ ఇలా చీత్కారాలు పొందుతూ ఎందుకు?

తను తినటం మానేయటమే కాక నువ్వు తినే వీలు కూడా లేకుండా అన్నం నేలపాలు చేయటం తప్పు కాదా? నువ్వు దూరమయితేనే నీ విలువ తెలిసొస్తుంది కనుక కొన్నాళ్ళు దూరంగా ఉండు" అంటాడు. దానికి కొత్తుడు సాష్టాంగ పడి, "తిండికి లేక బాధపడే నాకు తిండి పెట్టడమే ఎక్కువ, పైగా జీవితమంతా తిండిని పొందగల వీలునిచ్చే విలువయిన విద్యని నాకు ధారపోశారు. కొన్ని సంవత్సరాల పాటు ఉచితంగా భోజనం పెట్టి వృద్ధి చేసిన ఆయనకి కొన్ని రోజులు నన్ను ఉపవసించేలా చేసే హక్కు ఉంది. కనుక మహానుభావా!! వీలయితే నాకొక సాయం చేయండి. మీ ముందు ఇంకో ఇద్దరు వచ్చారు, మీరిక్కడే కాపలా ఉండి ఇలాంటి అనవసరమయిన నీతులు మరెవరూ చెప్పకుండా చేయండి చాలు" అంటాడు.

అంతే ఆ ముగ్గురూ ఇతని గురుభక్తికి మెచ్చి "కొత్తా! మేము త్రిమూర్తులం. నీ గురుభక్తికి మెచ్చాం, మేము పెట్టిన పరీక్షలో నువ్వు నెగ్గి నీ అపారమయిన గురుభక్తిని చాటుకున్నావు. నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాము" అంటారు. దానికి ఆనందించిన కొత్తుడు "మీ దర్శన భాగ్యం నా అదృష్టం. మీ గురించి నాకు చెప్పింది మా గురువుగారే. ఇప్పుడు మీ దర్శన భాగ్యం కలిగించినది కూడా ఆ గురువుగారే. కనుక నాకు నా గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు, మీ ముగ్గురినీ సృష్టించిన ఆ పరబ్రహ్మ ఎవరయితే ఉన్నారో ఆయన కూడా నాకు నా గురువే. అందువలన నాకు మోక్షానికి అర్హత వచ్చింది అంటే, నాకు ఇన్ని నేర్పించి, ఇంతలా తీర్చిదిద్దిన మా గురువు గారికి కూడా ఆ అర్హత ఉన్నట్టే కనుక ఆయనకే ఇవ్వండి" అంటాడు. ఇటువంటి గురుభక్తి ఉన్నందుకు శిష్యుడినీ, అటువంటి గొప్ప శిష్యుడిని తయారు చేసినందుకు గురువునీ ఇద్దరినీ మెచ్చిన త్రిమూర్తులు ఇరువురికీ మోక్షాన్ని ప్రసాదిస్తారు.

ఇటువంటి కథలు విన్నప్పుడు, చదివినప్పుడు స్ఫూర్తిదాయకంగా అనిపిస్తాయి. ఏ పనయినా పూర్తి చేయటానికి అత్యంత ముఖ్యం, అతి ముఖ్యం, ముఖ్యం అని మూడు కారణాలుంటాయి(ట). ఉదాహరణకి అన్నం వండాలనుకోండి, అత్యంత ముఖ్యమయినది బియ్యం, అతి ముఖ్యమయినవి నీళ్ళు, మంట, పాత్ర, మొ... ముఖ్యమయినది వండే విధానం తెలియటం. అదే విధముగా ఉద్యోగం సంపాదించి సుఖంగా జీవిస్తున్నారు అంటే గురువులు నేర్పిన విద్య అత్యంత ముఖ్యమయినది, అతి ముఖ్యమయినవి మన శ్రద్ధ, క్రమశిక్షణ, మొ., గురువులు నేర్పిన చదువులు బుద్ధికి పట్టేలా చేయగల బుద్ధిని ఇచ్చిన తల్లిదండ్రులు ముఖ్యమయినవారు. అందుకనే మాతృదేవోభవ, పితృదేవోభవ తరువాత ప్రాముఖ్యతని ఆచార్యదేవోభవ అంటూ గురువుకి ఇచ్చారు. ఇటువంటి జ్ఞానం మనకి అలవడిన నాడు నా కృషి వల్లనే నాకు ఉద్యోగం వచ్చింది అన్న అహంకారం ఉండదు. మరీ కొత్తుడంత లేకపోయినా అసలంటూ గురుభక్తి పెంచుకుని, గురువులని గౌరవించాలని ఆశిస్తూ గురువులందరికీ అంకితం...

**(వాట్సాప్ సేకరణ)**

# శుభోదయం

ధనం ఉంటేనే ఔదార్యం కలిగి సేవ/సహాయం చేయగలమా?

ఒకసారి చాలా పేదవాడు 'బుద్ధుడి' వద్దకి వచ్చాడు. అతను అడిగాడు.

'నేను ఎందుకు పేదవాడను?'

'బుద్ధుడు' సమాధానం చెప్పాడు: మీరు ఎందుకు పేదవారు అంటే 'మీరు ఎటువంటి ఔదార్యము కలిగి లేరు మరియు దానధర్మాలు చేయరు.'?

నేను ఇతరులకు దానం చేయడానికి 'నావద్ద ఏమున్నది?' అని ఆ పేదవాడు అడిగాడు?

అప్పుడు 'బుద్ధుడు' ఈ విధంగా చెప్పాడు.

మీరు ఇతరులతో పంచుకోగల 'ఐదు నిధులను'? కలిగివున్నారు.

మొదట 'మీ ముఖం'? ఉంది. మీరు ఇతరులతో 'మీ ఆనందాలను (నవ్వులను)' పంచుకోవచ్చు... ఇది ఉచితం... ఇతరులపై అద్భుతమైన ప్రభావాన్ని చూపుతుంది...

రెండవది 'మీ కళ్ళు?' మీకు ఉన్నాయి. మీరు 'ప్రేమ మరియు శ్రద్ధతో ఇతరులను చూడవచ్చు...' నిజం.. మీరు లక్షలాది మందిని ప్రభావితం చేయవచ్చు... వాటిని మంచి అనుభూతిగా చేయండి...

మూడవది 'మీ నోరు?' మీకు ఉంది. ఈ నోరుతో మీరు ఇతరులకు 'మంచి విషయాలు చెప్పవచ్చు... మంచి చర్చించండి..' వాటిని విలువైనదిగా భావించండి... ఆనందం మరియు సానుకూలత వ్యాప్తి చెందుతాయి...

నాలుగవది మీకు 'గుండె'? ఉంది. 'మీ ప్రేమగల హృదయంతో' మీరు ఇతరుల ఆనందాన్ని కోరుకోవచ్చు... ఇతరుల భావోద్వేగాలను అనుభూతి



చెందవచ్చు.. వారి జీవితాలను తాకవచ్చు...

మీరు కలిగి ఉన్న చివరి సంపద మీ శరీరం ... 'ఈ శరీరంతో మీరు ఇతరులకు అనేక మంచి పనులు చేయగలరు'...? అవసరమైనవారికి సహాయం చేయగలరు...

సహాయం చెయ్యడానికి డబ్బు అవసరం లేదు...

'ఒక చిన్న శ్రద్ధ, సంజ్ఞలు జీవితాలను వెలిగించగలవు'.

భగవంతుడు మనకిచ్చిన జీవితం...

కలకానిదీ! విలువైనదీ! 'సర్వోత్తమమైనదీ!'

ప్రతిక్షణం ఆనందంగా ఉంటూ, 'పదిమందికి సహాయపడుతూ, జన్మను చరితార్థం చేసుకుందాం.' ●

*Compliments from*
**Sri Krishna Bhat**
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*
**HOTEL MAYURA**
204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :




# "హౌడీ మోడీ" సభ ఓ దృశ్యకావ్యం!

– డొక్కా ఫణి

## జయహో!!

ఎక్కడ నీమనసు కుదుటపడుతుందో, ఎక్కడ అప్రయత్నంగా నీ కనులు చెమ్మగిల్లుతాయో, ఎక్కడ నీ చుట్టూ ఆనందం పరచుకుంటుందో, అదే దేవాలయం. ఆ దేవాలయం ఒక రాజకీయ సభలో కనబడడం అరుదు. కాదు కాదు, దాదాపు అసాధ్యం. అటువంటు అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారొకరు. మాట, నడక, ప్రవర్తన అన్నిటిలోనూ మానవాతీతమైన శక్తి ఏదో నడిపిస్తోన్న ఒక వ్యక్తిని చూసి, కుల మతాలతో సంబంధం లేకుండా, వచ్చిన భారతీయులంతా ఉప్పొంగిన గుండెలతో, అమితమైన ఆనందంతో, స్వాగతించారు. ఆ మూడు గంటలూ ఎల్లా గడిచాయో, తెలియనే లేదు. నేను కార్యక్రమ వివరాలు వ్రాయను. నా స్పందన మాత్రమే రాస్తాను. అవి మీకు నావద్ద తప్ప మరెక్కడా దొరకవు కదా.

ఒక రాజకీయ సభకు నేను వెళ్ళడం, జీవితంలో ఇది మూడోసారి. ఈ అనుభవం మాత్రం గతంలో ఎన్నడూ లేని ఒక గొప్ప అనుభూతిని మిగిల్చింది. మొదటి సభ జరిగింది పసితనంలో. ఏమీ తెలియని వయసది. రెండవ సభ జరిగింది కౌమార్యంలో కాబట్టి పూర్తిగా గుర్తుంది. అయితే, అప్పటి ఆనందానికి పైమాట వేసింది ఈ మూడవ సభ. శనివారం ఉదయమే నాలుగ్గంటలకు బయల్దేరి ఎయిర్‌పోర్ట్‌కి వెడితే, అక్కడ "సౌత్ ఎకానమీ పార్కింగ్ "లో లో పార్కింగు ప్లేస్ ఉంది అన్నాడు. లోపలికెళ్ళి ఓ పావుగంట తిరిగాకా తెలిసింది, అక్కడ ఒక్క స్పేస్ కూడా లేదని. దేవుడో గోడో అంటూ బైటికొచ్చి, బుద్ధిగా పార్క్ అండ్ ఫ్లై వాడి దగ్గర పార్క్ చేసుకుని, వాడి బస్సులో వెళ్ళి సెక్యూరిటీ పూర్తిచేసి గేటు దగ్గరికెళ్ళేసరికి బోర్డింగ్ అప్పుడే మొదలెడుతున్నారు. సరే, ఓ మూడు గంటల తరువాత ఆస్టిన్‌లో అతి చిన్న రెండో ఎయిర్పోర్ట్ టెర్మినల్‌లో దింపాడు. అక్కడినించి మెట్లు (రాంప్) దిగి, నడుచుకుంటూ లోపలికెడుతుంటే, పెళ్ళైన కొత్తలో భువనేశ్వర్ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన భావన కలిగింది. అన్న వచ్చాడు, మరో గంటలో తమ్ముడు వచ్చాడు.

అందరూ ఇల్లు జేరి, సాయంత్రం నాలుగున్నరకు, మేం ముగ్గురము, మా బంధువు మరొకరితో హ్యూస్టన్ బయల్దేరి వెళ్ళాము. అక్కడ "మహారాజభోగ్" అనే పేరుతో ఒక గొప్ప రెస్టారెంటు ఉందట. అక్కడ డిన్నర్ చేద్దామని వెడితే, బయట కనీసం వందమంది వెయిట్ చేస్తున్నారు. వీళ్ళు కాక పార్కింగు లాట్ లో మరో వందమందిదాకా కార్లలో వెయిట్ చేస్తున్నారు. అప్పుడర్థమైంది మర్నాటి సభ ఎలా ఉండబోతోందో. బుద్ధిగా ఆ దగ్గరలో ఉన్న బాలాజీ భవన్ లో భోజనం, క్వాలిటీ ఐస్క్రీం షాపులో ఫలూడాలు సేవించి, హోటలు చేరేసరికి తొమ్మిదిన్నర.

మేము ఉంటున్న హాలిడేఇన్ హోటలు సభ జరిగిన "ఎన్.ఆర్.జి" స్టేడియం ఎదురుగా ఉంది. మా రూమునుంచి పార్కింగు లాట్, స్టేడియం ఎంట్రన్సు కనిపిస్తున్నాయి.

ఉదయం ఆరున్నర కల్లా మేమంతా రెడీ. బయట చూస్తే అప్పుడే పండగలా ఉంది. స్టేడియం బయట బారులు తీరి వున్నాయి కార్లు, వేనులు, బస్సులు. కొన్ని రోడ్లు మూసేసారు. ఎంతో మంది పోలీసులు ఒక వ్రతంలాగ తమ విధులు నిర్వహిస్తున్నారు. మేము బ్రేక్ఫాస్ట్ కానిచ్చి, నడక మొదలెట్టాము. పావుగంట పట్టింది, చుట్టు తిరిగి గేట్ నెంబరు 10 చేరుకోవడానికి. అక్కడ వాలంటీర్లని చూస్తే ముచ్చట వేసింది. యువకులు, నడి వయస్సువాళ్ళు, పెద్దలు, వృద్ధులు ఎందరో వాలంటీర్లు. అందరూ నవ్వుతూ, హాయిగా ఉన్నారు. అందరినీ అడిగి మరీ వారికి దారి చూపిస్తున్నారు. గేటు దగ్గర మా టికెట్టు స్కాన్ చేసి లోపలికి పంపారు. స్టేడియం ప్రాంగణంలో ఒక పక్కగా ఒక చిన్న వేదిక మీద అప్పటికే పిల్లల, పెద్దల డాన్సు కార్యక్రమాలు జరుగుతున్నాయి. కొందరు వాటిని తిలకిస్తున్నారు. రెండు పెద్ద లైన్లు కనిపించాయి. ఒకవైపు ఆడవాళ్ళు, రెండో వైపు మగవాళ్ళు. మేము వెళ్ళి మగవాళ్ళ లైన్లో నిలుచున్నాము. ఓ రెండునిముషాలాగి, తమ్ముడు వెళ్ళి చూసి వచ్చి చెప్పాడు, ఇవి "రెస్ట్ రూం" కి వెళ్ళడానికి కట్టిన లైన్లు అని. నవ్వుకుని, బైటికొచ్చి అవతలవైపున ఉన్న గేట్లలోంచి, ఏవిధమైన క్యూలు లేకుండా, నేరుగా లోపలికి వెళ్ళాము.

అక్కడ టీషర్టులు ఉచితంగా ఇచ్చారు. మనిషిని చూడగానే వారు మీడియమ్మో, లార్జో, ఎక్స్ట్రా లార్జో, మరొకటో ఇట్టే గ్రహించి ఆ టీషర్టు చొప్పున ఇస్తున్నారు. వారంతా కూడా సరదాగా, జోకులు వేస్తూ, నవ్వుతూ, నవ్విస్తున్నారు. మేము అక్కడ ఆ టీషర్టు పైన వేసుకుని ఫొటోలు దిగి, ఎస్కలేటరు ఎక్కి పైకి చేరాము. అక్కడ మోదీ గారి బొమ్మతో ఫొటోలు తీసుకున్నాము. ఎదురుగానే మా సీట్ల సెక్షను కనిపించింది. వేదికకి దగ్గరగా, బ్రహ్మాండమైన సీట్లు దొరికాయి. సెటిలయ్యాము. మా అట్లాంటా లో పేరు మోసిన తెలుగువారు, బీజేపీ కార్యకర్తలు కొందరు మెయిన్ ఫ్లోర్ మీద కనిపించారు. మరి కొంతమంది అట్లాంటా మిత్రులు కూడా కలిసారు. పసి పిల్లల దగ్గరనుంచి, పండు ముసలివారి వరకూ అలా అలా వస్తూనే ఉన్నారు. ఎంతోమంది వీల్ చెయిర్లలో కూడా వచ్చారు. అందరి మొహాలలోను తెలియని ఆనందం. ఏవో సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి.

ఇంతలో తమ్ముడు వెళ్ళి అందరికీ మసాలా టీ తెచ్చాడు. అట్లాంటా మిత్రులొకరు సమోసాలు అందించారు. స్టేడియంలోని ప్రతి సెక్షనూ నిండడం మొదలైంది. పదయ్యేసరికి స్టేడియమంతా జనంతో కిటకిటలాడిపోయింది. ఎటుచూసినా జనం. "ఆకాశం చిల్లు పడిందా, ఒక ఏరు కట్టలు త్రెంచుకు ప్రవహిస్తోందా, నేల ఈనిందా అన్నట్లుగా"నే అనిపించింది. ఆ మాటలకు అసలైన అర్థం ఇదా అన్నట్లుగా ఉందా దృశ్యం. సాంస్కృతిక కార్యక్రమాలయ్యాయి. బానే ఉన్నాయి. ఆనక సెనేటర్లు వచ్చారు. టెడ్ క్రూజ్ చాలా క్లుప్తంగా, సూటిగా, చక్కగా మాట్లాడాడు. అతనిలో ప్రజలను ఆకట్టుకునే తత్వమేదో ఉన్నది. భవిష్యత్తులో ఇంకా మంచి పదవులు అలంకరిస్తాడని, ప్రజలకు సేవ చేస్తాడని ఆశిద్దాము. ఆనక అందరూ ఎదుచూస్తున్న సమయం రానే వచ్చింది.

గతంలో ఏ భారత ప్రధానికీ దక్కని గౌరవాన్ని ఇస్తూ, సుమారు 30 మంది సెనేటర్లు అధికారులు స్వాగతించగా, రెడ్ కార్పెట్ పైన సింహంలా ఠీవిగా నడుచుకుంటూ భారత ప్రధాని, ప్రియతమనేత శ్రీ.నరేంద్ర మోదీ గారు వచ్చారు.

ఆయన్ని సెనేటర్లు, అధికారులు వేదిక పైకి స్వాగతించారు. వేదికపైన ఆయన్ని పరిచయం చేసిన సెనేటర్ గారు చాలా పేజీలు చదివారు, కాస్త సహనాన్ని పరీక్షించారు. మోదీగారు అందరినీ కలిసారు. కరచాలనం చేసి, వారితో మాట్లాడారు.

ఆనక వందిమాగధులతో అమెరికా అధ్యక్షులు ట్రంప్ గారు వచ్చారు. వారు, మోడిగారు కలసి రెడ్ కార్పెట్ మీద నడవటం, అక్కడ వేచి ఉన్న పిల్లతో మాట్లాడి, వేదిక వద్దకు రావటం పెద్ద తెరమీద చూపించారు. పిమ్మట మోదీగారు వేదిక పైకి వచ్చి "ట్రంప్ గారిని" సభకు ఆప్యాయంగా ఆహ్వానించారు. ఒక గొప్ప వ్యక్తి, తన మిత్రుణ్ణి ఎలా పరిచయం చేస్తాడో, ఎలా గౌరవిస్తాడో, స్వాగతిస్తాడో, అలా ఉందా పరిచయం. వాటిల్లో అందరికీ అమితంగా నచ్చిన మాట "అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్". దీనితో మీలో చాలామంది ఏకీభవించకపోవచ్చు. నేను వంద శాతం మళ్ళీ ట్రంపుగారే వస్తారని నమ్ముతున్నాను నా వ్యక్తిగత ఆలోచనలవల్ల, విశ్లేషణలవల్ల. దీన్ని మీరు గౌరవించకపోయినా, నా అభిప్రాయంగా అనుకుని వదిలేస్తే చాలు.

సరే, ట్రంపు గారు ఎంతో సరదాగా, హుందాగా, మాట్లాడారు. ఏమాటలు మాట్లాడితే అమెరికా, భారత దేశాలమధ్య నిజమైన స్నేహం పెరుగుతుందో, ఏ "కీ వర్డ్స్" అమెరికా ప్రెసిడెంట్ మాట్లాడాలి అని ప్రతి భారతీయుడు కోరుకుంటాడో, ఆ మాటలన్నీ మాట్లాడారు. నేను విడమరచి చెప్పనక్కర్లేదు మళ్ళీని. మీకు తెలుసు. టెర్రిజం గురించి, మిలట్రీ పరస్పర సహకారం గురించి, స్పేస్ రీసెర్చ్ లో సంయుక్తంగా చేయబోయే కార్యక్రమాల గురించీ, ఎన్.బి.ఏ బాస్కెట్ బాల్ కార్యక్రమాలని భారత్ తీసుకురావడం గురించీ హుషారుగా మాట్లాడి "మీరు పిలిచినా పిలవకపోయినా మా ఎన్.బీ.ఏ ఆట చూడ్డానికి ముంబై వచ్చేస్తా" అని జోక్ చేసి, తరువాత అందరూ మెచ్చుకునే రీతిలో భారత ప్రధానిని సభకు పరిచయం చేసి, "యౌ ఆర్ ఎ వెరీ వైజ్ మేన్" అని మోదీగారికి చక్కని కితాబులిచ్చి, తరువాత, తన ప్రెసిడెన్సీలో అమెరికా లో జరిగిన అభివృద్ధిని గణాంకాలతో సహా వివరించి, హుందాగా తన ప్రసంగం ముగించారు. ప్రోటోకాల్స్ అన్నిటినీ పక్కకు తోసి, సుమారు ముప్ఫై మంది సెనేటర్లు, అధికారులతో సహా, సభలో ముందు వరసలో కూర్చుని, మోదీగారి ప్రసంగం ఆసాంతం ఆసక్తితో విన్నమా ప్రెసిడెంట్ ట్రంప్ గారి స్నేహశీలతకు హేట్సాఫ్.

పిమ్మట శ్రీ నరేంద్ర మోడీ మాట్లాడారు. ఆయన మొదలుపెట్టేముందు, అందరూ లేచి నిలబడి కొద్ది నిముషాలసేపు చప్పట్లతో స్టేడియమంతా మారుమ్రోగిం చేసారు. ఆ జనాన్ని చూసి ఆశ్చర్య చకితులైన కొందరు సెనేటర్లు తమ ఫోనుల్లో జనాల వీడియో తీసుకోవడం ఆశ్చర్యకరమైన విషయం.

మోడీ గారు ఏం మాట్లాడారో, ఎలా మాట్లాడారో మీరంతా ఈ పాటికి ఒకటికి రెండు సార్లు వినే ఉంటారు. ఆ వాగ్ధాటి, ఆ నిశితమైన పరిశీలనా దృష్టి, ఆ సంతులనం, ఆ సంయమనం అనితర సాధ్యం. ముఖ్యంగా ఆయన ఒక మాట చెప్పినప్పుడు నాకళ్ళమ్మట నీళ్ళు ఆగలేదు. "ట్రంప్ గారూ, 2017 లో నేను వచ్చినప్పుడు మీ కుటుంబాన్ని పరిచయం చేసారు. ఇదిగో, ఇవాళ నేను మీకు మా కుటుంబ సభ్యుల్ని పరిచయం చేస్తున్నాను" అని. ప్రతి భారతీయుడు తన కుటుంబ సభ్యుడని ఒక అంతర్జాతీయ వేదికమీద గర్వంగా చెప్పటం ఎంత గొప్ప మాట. సభలో ఎంతో మంది కళ్ళు చెమ్మగిల్లాయి. తరువాత చెప్పారు, కోట్లాది భారతీయులు అదేశాలమేరకు నేను పరిపాలిస్తున్నాను. వారు లేనిదే మోడీయే లేరు అని. అలా అనటం ఆయన వినయానికి నిదర్శనం. "ఆ, ఈమాటలన్నీ ఎవరో రాసిస్తారండీ, అవి బట్టీపట్టుకొచ్చేసి వీళ్ళు చెప్పడమే" అన్నారు కొందరు. వారందరికీ నేను చెప్పేది ఒక్కటే. ఈసారి ఎప్పుడైనా ప్రధాని మోడీ గారు మాట్లాడినప్పుడు ఆయన కళ్ళలోకి చూడండి. కళ్ళు ఎప్పుడూ అబద్ధం ఆడవు. అది నటన కాదు, అది డబ్బింగు చెప్పడం కాదు, అది రాజకీయం కాదు. వీటన్నిటికీ అతీతమైనది, ఉన్నతమైనది.

ఆయన ప్రసంగంలో ఆర్టికల్ 370 రద్దు బిల్లును సమర్థించిన భారత శాసన సభ్యులకోసం, భారత దేశానికి స్నేహ హస్తాన్ని అందిస్తున్న ట్రంపు గారికోసం లేచి నిలబడి చప్పట్లు కొట్టమని అందరినీ కోరడం, దానికి అందరూ సంతోషంగా ఆ రెండు సందర్భాలలోనూ లేచి, చప్పట్లుకొడుతూ తమ ఆమోదాన్ని తెలియచేయటం చాలా బాగా అనిపించింది. ఆ ప్రసంగం విన్నంతసేపూ, ఇంకా వినాలనిపించేలా ఉంది. ప్రసంగం చివరిలో సపరివారంగా భారతదేశం రావాలని ట్రంపుగారికి మోదీ గారు ఆహ్వానం పలికారు.

తన ప్రసంగం మొదటిలోనే, ఈ కార్యక్రమానికి వద్దామనుకుని, టికెట్లు దొరకక, స్థలాభావం వల్ల రాలేకపోయిన వారందరినీ వ్యక్తిగతంగా క్షమాపణలు కోరటం మోదీగారి వినయానికి నిదర్శనం. అప్పుడే అయిపోయిందా, కల కరిగిపోయిందా అన్నట్లనిపించింది ఆయన ప్రసంగం పూర్తవగానే. తరువాత మోదీగారు, ట్రంప్ గారివద్దకు వెళ్ళి ఆయన్ను ఏదో కోరారు. ఆయన అంగీకారంగా తల ఊపారు. అప్పటికప్పుడు వారిద్దరూ చేతిలో చెయ్యి వేసుకుని నడుస్తూ, స్టేడియం అంతా ఒక చుట్టు చుట్టి, అందరి వద్దకూ వచ్చి, ఆత్మీయంగా చేతులూపుతూ, అందరికీ అభివాదాలు తెలిపారు.

"ఆశ" మనిషిని బ్రతికిస్తుంది. జీవితాన్ని కొనసాగిస్తుంది. కోట్లాది మంది బ్రతుకులలో ఆ "ఆశ" అనే చిరుదీపాన్ని వెలిగించగలిగినవాడే నేత. అటువంటి నేత దర్శనమైనందుకు నాకు ఒడలు పులకరించింది. అపరాహ్నం ఒంటిగంటా నలభై నిముషాలైనా, లంచి కి లేట్ అయిపోయినా, అసలు ఆకలి అన్నదే తెలియలేదు. కడుపు కన్నా ముందు, మనసు నిండిపోయింది, అందుచేత. మోదీగారికీ, మా దేశాధ్యక్షుడు ట్రంపు గారికి వీడ్కోలు చెప్పి, బైటికొచ్చాము. వాలంటీర్లు అందరికీ ఉచితంగా కారపూస పొట్లాలు పంచిపెట్టారు. సావనీరు ఇచ్చారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఏవిధమైన అడ్డంకులూ లేకుండా, చక్కని ప్రణాళికతో, ఇంత సాఫీగా నడిపించిన టెక్సస్ ఇండియా ఫోరం వారికీ, వారికి సహాయపడిన దాదాపు 160 సంస్థలకీ, వారి వాలంటీర్లకీ పేరు పేరునా కృతజ్ఞతలు.

ఇంతా చదివాకా, ఇంకా ప్రియతమ భారత ప్రధాని గారి పరిపాలన పట్ల అపనమ్మకంతో ఉండేవారికోసం ఒక సినిమా డైలాగు "కటౌట్ చూసి కొన్ని కొన్ని నమ్మేయాలి డూడ్". ●

# భగవన్నామస్మరణ

చనిపోయే ముందు భగవంతుని తలుచుకుంటే మోక్షం వస్తుంది అని విని ఒకతను యముడితో నన్ను తీసుకెళ్లే ముందు ఒక కాల్ చెయ్యి, నేను భగవంతుని తలుచుకుంటా అన్నాడు.

దానికి యముడు ఓకే అన్నాడు. ఇంకేముంది అతను హ్యాపీగా వున్నాడు. ఒక రోజు హఠాత్తుగా అతడు చనిపోయాడు. యముడు నరకానికి తీసుకు వెళ్తుంటే, నువ్వు చెప్తానని మాట ఇచ్చి మోసం చేసావు అన్నాడు. యముడు అన్నాడు నేను నా పద్ధతిలో 4 times కాల్స్ చేశాను, నువ్వు పట్టించుకోలేదు అన్నాడు అతను, నువ్వు అబద్ధం చెప్తున్నావ్, నాకు కాల్స్ రాలేదు అన్నాడు.

1st కాల్‌గా జుట్టు తెల్లబడేలా చేశాను, నువ్వు రంగేసుకొని పట్టించుకోలేదు.


2nd కాల్‌గా కళ్లకి చత్వారం వచ్చేలా చేశాను. నువ్వు స్పెక్ట్స్ తెచ్చుకున్నావు కానీ పట్టించుకోలేదు.

3rd call గా B.P, షుగర్ వచ్చేలా చేశాను, తిండి మార్చుకున్నావు కానీ మళ్ళీ పట్టించుకోలేదు.

4th callగా పళ్లు ఊడేలా చేశాను. నువ్వు పళ్లు కట్టించుకున్నావు కానీ భగవంతుని ఒక్కసారి కూడా తలుచుకోలేదు. నాలుగుసార్లు చెప్పినా పట్టించుకోలేదు, నీ టైం అయిపోయింది అందుకే నరకానికి తీసుకెళ్తున్నా అన్నాడు.

జీవితంలో ప్రతిదీ హ్యాపీగా accept చేస్తూ, భగవంతుని స్మరిస్తూ ఉండాలి.

సారాంశం ఏమిటంటే ఒకేసారి స్మరణ రాదు, స్మరించడం అలవాటు చేసుకోవాలి, అపుడు చివరిదశలో సహజంగా భగవంతుని స్మరణ వస్తుంది. ●







# శ్రీకృష్ణ మందిరం... ఉడుపి...!!

భారతదేశంలో శైవ క్షేత్రాలతో పాటే తప్పకుండా సందర్శించవలసిన పౌరాణిక ప్రాధాన్యం ఉన్న వైష్ణవ క్షేత్రాలు అనేకం ఉన్నాయి. వాటిలో ప్రముఖంగా చెప్పుకో దగ్గవి ప్రసిద్ధ స్వయం వ్యక్త విష్ణు క్షేత్రాలు ఎనిమిది. వీటిలో ఎనిమిదవదయిన ... సాలగ్రామం, నేపాలులో ఉండగా. మిగతా ఏడు...

1. తిరుమల (అంధ్రప్రదేశ్) ,
2. శ్రీరంగం, 3. శ్రీముష్ణం , 4. తోతాద్రి (తమిళనాడు) లో ఉండగా
5. నైమిశారణ్యం (ఉత్తరప్రదేశ్)
6. బదరీ (ఉత్తరాఖండ్)
7. పుష్కర్ (రాజస్థాన్) లు

భారతదేశంలో ఉన్నాయి.

ఇవి కాకుండా విష్ణుమూర్తి, కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురములో అనంతపద్మనాభ స్వామిగా మనకు దర్శనమిస్తాడు. దశావతారాలలో సంపూర్ణావతారా లుగా చెప్పబడినవి

అతి ముఖ్యమైనవి శ్రీరామావతారం, శ్రీకృష్ణావతారం.

భారతదేశంలో రామమందిరం లేని గ్రామం ఉండదంటే అతిశయోక్తి కాదు. ఐనా ప్రసిద్ధి చెందిన రామాలయాలు

రెండే రెండు! వాటిలో ఒకటి.... తెలంగాణా రాష్ట్రంలోని భద్రాచలం, రెండవది తమిళనాడు లోని మధురాంతకం! ఇది కాంచీపురం జిల్లాలో ఉన్నది. మూడవది ఇంకా దేవాలయ స్థాయి పొందనిది ఉత్తరప్రదేశ్ లోని అయోధ్య!

శ్రీకృష్ణుని విషయానికి వస్తే నాలుగు ఆలయాలను ప్రధానంగా చెప్పుకోవచ్చు! ఇవి ఉత్తర భారతంలో 1.ఉత్తరప్రదేశ్ లోని మధుర,

2. గుజరాత్ రాష్ట్రంలో ద్వారక,

3.దక్షిణ భారత దేశంలో కేరళలోని గురువాయూరు, 4.కర్ణాటకలోని ఉడుపి.

ద్వైత సిద్ధాంత ప్రతిపాద్యులు, త్రిమతాచార్యులలో ఒకరైన జ్ఞానజ్యోతి శ్రీ శ్రీ శ్రీ మధ్వాచార్యులవారి జననం, జీవితం ప్రసిద్ధ శ్రీకృష్ణ క్షేత్రం కర్ణాటక లోని ఉడిపితో సంబంధించి ఉన్నది.

ఒకరోజు శ్రీమధ్వాచార్యులవారు వేకువ ఝామునే సముద్ర తీరానికి వెళ్లి స్నానం చేసి ప్రాతఃసంధ్యాదికాలుముగించుకుని ఆ తీరంలోనే కూర్చుని ద్వాదశ స్తోత్ర రచనను ప్రారంభించారు.

ఒక దీక్షతో ద్వాదశ స్తోత్ర రచన సాగుతోంది. ఆ రోజు ఏదో పర్వదినం కావటంతో అనేకమంది ప్రజలు కూడా వచ్చి సముద్ర స్నానం చేశారు.

ప్రశాంతమైన ప్రాతఃకాలం, భక్తి ప్రపత్తులు ప్రసరించటానికి అనువైన సమయం.

అలాంటి నేపథ్యంలో శ్రీమధ్వాచార్యుల వారు నిరాటంకంగా ద్వాదశస్తోత్రంలోని ఐదు అధ్యాయాల రచన పూర్తి చేశారు. ఆరో అధ్యాయం ప్రారంభం కాబోతుంది. ఇంతలో.... సముద్రంలో ద్వారక నుంచి సరుకులు తీసుకు వస్తున్న ఒక నౌక తీరం వెంట వెళుతూండగా అకస్మాత్తుగా విపరీతంగా గాలులు ప్రారంభమయ్యాయి.

ఆ గాలులకు సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. నౌక ప్రమాదంలో చిక్కుకున్నది. దానిని రక్షించుకోటానికి అందులోని నావికుల ప్రయత్నాలు ఫలించటంలేదు. క్రమంగా నౌక లోకి నీరు చేరటం ఆరంభమైంది.

ఇక ఏ క్షణాన్నైనా మునిగిపోవటానికి సిద్ధంగా ఉన్నది. నావికులందరూ భయాందోళనలకు గురైన సమయంలో చివరి ప్రయత్నంగా నౌకకు సంబంధించిన ముఖ్య వ్యాపారి తీరం వైపు చూస్తూ రక్షించేవారి కోసం ప్రార్థన చేయటం మొదలుపెట్టాడు. అంత దూరాన్నుంచి కూడా ఒడ్డుపై నిశ్చలంగా కూర్చుని రచన చేసుకుంటున్న తేజస్వి ఆ వ్యాపారికి స్పష్టంగా గోచరించారు. ఆయనను ఉద్దేశించి మరింత ఆర్తితో ప్రార్థించ సాగాడు.

ద్వాదశ స్తోత్ర రచనలో లీనమై ఉన్నప్పటికీ, అంతటి హోరుగాలిలోనూ, అంత దూరాన్నుంచి వ్యాపారి చేస్తున్న ప్రార్థన మధ్వాచార్యుల చెవిని తాకింది. అప్రయత్నంగా అటుకేసి తల తిప్పారు. జాలి కలిగింది. వెంటనే తన ఉపవస్త్రం ఒక కొసను పట్టుకుని గాలిలో నావ కేసి విసిరి వెనక్కు తీసుకున్నారు.

అంతే! ఆ క్షణం వరకూ సముద్రంలో మునిగిపోతుందా అన్నట్టున్న నౌక ఒక్కసారిగా స్తబ్దతకు వచ్చింది. ఎవరో తాళ్ళు పట్టి లాగినట్టుగా తీరానికి చేరి స్థిరంగా నిలిచింది. నావికులందరూ సురక్షితంగా ఒడ్డుకు చేరారు.

అంతకు మునుపు ప్రార్థన చేసిన వ్యాపారి వడివడిగా మధ్వాచార్యుల వారిని సమీపించి సాష్టాంగ నమస్కా రం చేశాడు. అనేక విధాలుగా స్తుతించాడు.

అనంతరం లేచి నిలబడి అంజలి ఘటించి "స్వామీ, నా వద్ద అమూల్య మైన వస్తువులు అనేకం ఉన్నాయి. వాటిలో మీరు కోరుకున్నదేదైనా సరే.... ఇవ్వటానికి సిద్ధంగాఉన్నాను.దయచేసి కాదనకండి అని అనేకవిధాల ప్రాధేయ పడ్డాడు.

మధ్వాచార్యులవారు చిరునవ్వు నవ్వి చివరికి అతని కోరికను మన్నించారు. "అయితే నువ్వు నాకు బహుమతిగా ఇవ్వాలనుకుంటున్న అమూల్యమైన వస్తువు, నీ నౌకలో ఉన్న రెండు గోపీ చందనపు గడ్డలు ఈయగలవా...?" అన్నారు.

వ్యాపారి ఆశ్చర్యపోయాడు.

ఎందుకంటే, గోపీ చందనం ద్వారకలో ఎక్కడపడితే అక్కడ దొరికే మట్టి!

పడవలలో సరుకులు ఎక్కించేటప్పుడూ దించేటప్పుడూ బరువు సమతూకం తప్పిపోకుండా... గోపీ చందనం గడ్డల సాయంతో నౌకలో సరుకును అటూ ఇటూ సర్దుతూ ఉంటారు.

అలాంటి గోపీచందనం మట్టిగడ్డలు ఈ మహానుభావుడు కోరటం.... ఆ వ్యాపారికి సుతరామూ నచ్చలేదు.ఎంత ప్రార్థించినా మధ్వాచార్యులవారు తాను కోరిన గోపీ చందనానికి మించి మరే బహుమతినీ తీసుకోవటానికి అంగీక రించలేదు. చివరికి ఆ వ్యాపారి, స్వామి కోరిన ఆ గోపీచందనం గడ్డలనే .... ఇవ్వటానికి సిద్ధపడి, అవే కోరటంలోని పరమార్థమేమిటో, ఆ మట్టిగడ్డల మహిమా విశేషాలేమిటో కనీసం అదయినా తెలుపమని ప్రార్థించాడు.

స్వామి మళ్ళీ చిరునవ్వు చిందిస్తూ "నువ్వే చూడు" అంటూ ఆ గడ్డలను అందరూ చూస్తూ ఉండగా నీటితో కరిగించారు.

అద్భుతం...

ఒక గడ్డ నుంచి బలరాముని విగ్రహం, రెండవదాని నుంచి శ్రీ కృష్ణుని విగ్రహం బయట పడ్డాయి. అక్కడ ఉన్న వారందరూ సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు.

శ్రీకృష్ణ విగ్రహ దర్శనం తోనే... మధ్వాచార్యులు ద్వాదశ స్తోత్రం లోని ఆరవ అధ్యాయంలో దశావతారాన్ని వర్ణించారు. ఇక బలరాముని విగ్రహాన్ని అక్కడే ప్రతిష్టించి శ్రీకృష్ణుని విగ్రహం తీసుకుని ఉడుపికి ప్రయాణమయ్యారు.

శ్రీకృష్ణ ప్రాప్తి తరువాత ద్వాదశ స్తోత్రాన్ని పరిసమాప్తి చేశారు. అందుకే ద్వాదశస్తోత్రం అత్యంత పవిత్రమైనది. అమృతరూపమైనటువంటి శ్రీకృష్ణుని ఆగమనానికి కారణమైంది. అది విషాహార స్తోత్రంగా కూడా ప్రసిద్ధి.

ఇంతకీ శ్రీకృష్ణుని విగ్రహ రహస్యం ఏమిటి? వాస్తవానికి జరిగిందేమిటి? ఈ కథ మరింత ఆసక్తిగా ఉంటుంది....

ఆ శ్రీకృష్ణుని విగ్రహం సామాన్యమైనది కాదు.

ఒకసారి దేవకీదేవి "కృష్ణా నీ బాల్యలీలలు చూసే భాగ్యం యశోదకు కలిగినట్టుగా నాకు కలుగలేదు. వాటి గురించి వినీ వినీ ఎప్పటికైనా చూడాలని నా మనస్సు ఉవ్విళ్ళూరు తోంది. చూపించవా కృష్ణా " అని ప్రార్థించిందట.

కృష్ణుడు అనుగ్రహించాడు.

మరుక్షణంలో శైశవ దశలో కృష్ణుడుగా మారిపోయాడు. తప్పటడుగులు వేస్తూ నడిచాడు. దేవకీదేవి ఒడిలో కూర్చున్నాడు. ఆమె స్థన్యాన్ని త్రాగాడు. కేరింతలు కొట్టాడు. కుండ పగులగొట్టి వెన్న తిన్నాడు. వంటినిండా వెన్నను రాసుకున్నాడు. పామును తాడు లాగా పట్టుకుని మజ్జిగ చిలికినట్టు నృత్యం చేశాడు. మరీ ముఖ్యంగా తనతో పాటు అన్న బలరాముణ్ణి కూడ చూపించాడు.

ఈ చేష్టలను చూసి దేవకీదేవి పరవశించి మైమరచిపోగా ఇదంతా గమనిస్తున్న రుక్మిణి తన పతిదేవుడి శైశవ రూపాన్ని ప్రపంచమంతా చూసి తరించాలని భావించి వెంటనే విశ్వకర్మను పిలిపించి ఆయా రూపాల్లో శైశవ కృష్ణుని, బలరాముల విగ్రహాలు చేయించింది.

ముందుగా తానే సకల వైభవాలతో ఆవిగ్రహాలను స్వయంగా పూజించింది. కృష్ణావతారం ముగిసింది.

మరికొంత కాలానికి ద్వారక సముద్రంలో మునిగిపోయే సమయం ఆసన్నమైంది. దూరదృష్టితో అర్జునుడు ఆ విగ్రహాలను తీసుకువెళ్ళి ఒక ప్రదేశంలో స్థాపించి దానికి రుక్మిణీ వనం అని నామకరణం చేశాడు.

కాలక్రమంలో ఆ వనం యావత్తూ గోపీ చందనం మట్టిలో కలిసి కనుమరుగై పోయింది.

నావికులు తమనౌకల్లో సమతూకాన్ని పాటించటంకోసం గోపీచందనం మట్టి గడ్డల్ని మోసుకెళ్ళే అలవాటు ప్రకారం, కాకతాళీయంగా ఈ విగ్రహాలున్న గోపీ చందనం గడ్డల్నికూడా నౌకలోకిచేర్చారు వాటివిలువ తెలియకుండానే ఆ గడ్డల్ని తీసుకెళ్ళే భాగ్యం ఆ వ్యాపారికి లభించింది.

ఆ విగ్రహం ఆ నౌకలో వస్తోందని మధ్వాచార్యుల దివ్య దృష్టికి ముందే తెలుసు. ద్వాదశ స్తోత్రాన్ని రచిస్తూ ఆ విగ్రహాలను ఆహ్వానించటానికే ఆయన ఆరోజు ఆ తీరానికి వెళ్ళారు.

ఆ శ్రీకృష్ణుని ప్రతిమను మధ్వాచార్యులు తమ శిష్యులచేత మాధవ సరోవరంలో ప్రక్షాళన చేయించారు. తరువాత తానే స్వయంగా అభిషేకించారు.

ఈ అభిషేకానికి మునుపు నలుగురు శిష్యులు సునాయాసంగా ఎత్తిన ఆ విగ్రహం మధ్వాచార్యులు అభిషేకించిన తరువాత ముప్పై మంది కలిసినా ఎత్తడం సాధ్యం కాలేదు! ఎందుకంటే, మధ్వాచార్యుల అభిషేకంతో.... ఆ విగ్రహంలో శ్రీకృష్ణుని దివ్యశక్తి పరిపూర్ణంగా ఏర్పడింది.

మంత్ర విధులతో మధ్వాచార్యులు అత్యంత శాస్త్రోక్తంగా శ్రీకృష్ణ విగ్రహాన్ని 'విళంబి'నామ సంవత్సరం మాఘ శుక్ల తదియ నాడు (క్రీ.శ.1236) ఉడుపిలో ప్రతిష్టింప జేశారు.

ఆనాటి నుంచీ ఉడుపి ప్రాంత యాజ్ఞికులందరూ మధ్వాచార్యులు అవలంబించిన విధానాలనే అనుస రిస్తున్నారు.

శ్రీ కృష్ణ మఠంగా పిలువబడే ఈ దేవాలయానికి అనుబంధంగా తన ఎనిమిది మంది శిష్యులచే నిర్వహింప బడేట్టుగా 1.'పెజావరు మఠం,2.పుట్టిగే, 3. పాలిమరు, 4. ఆడమారు, 5. సోదే, 6. కాణియూరు, 7. శిరూర్, 8. కృష్ణపురా అనే ఎనిమిది మఠాలనూ శ్రీ మధ్వా చార్యులు ఏర్పరచారు.

వీటిని అష్టపీఠాలు అంటారు. ఇవన్నీ ఉడుపి కేంద్రం గానే శ్రీ కృష్ణ మఠానికి చుట్టుప్రక్కలే ఉన్నాయి.

ఇదీ సూక్ష్మంగా ఉడుపిలోని శ్రీకృష్ణ దేవాలయ చరిత్ర.... ●

## లోకా సమస్తా సుఖినోభవన్తు!

అన్నం గురించి ఓ ఉపాఖ్యానం వుంది.

అన్నం వండేవారు ఏ మనస్సుతో, ఏ భావంతో వండుతారో, దాని ప్రభావం ఆ అన్నం మీద, దాన్ని తినేవారి మీద కూడా ఉంటుంది. అందుకనే దేవుడికి నైవేద్యం వంట చేసేవారు కనీసం దాని రుచిని ఆఘ్రాణించను కూడా ఆఘ్రానించరు. అలా మనసా, వాచా, కర్మణా కూడా తయారైన నైవేద్యాన్ని దేవుడికి నివేదించడం వల్ల దాన్ని దేవుడు ఆరగించటంవల్లే నైవేద్యానికి అంత రుచి వస్తుంది.

వంట చేసేవారు కోపంగా, విసుగ్గా వంట చేస్తే, ఆ వంటకాలకు సరైన రుచి రాకపోగా, దాన్ని భుజించిన వారి మనస్సు కూడా కోపతాపాలకు నిలయమవుతుంది. అందుకే వంట చేసేటప్పుడు ఆ వంట చేసేవారు మానసికంగా ప్రశాంతంగా, సంతోషంగా వంటచేస్తే, దానికి రుచితోపాటు ఆ వంట తిన్నవారి మనస్సులు సంతోషంగా వుంటాయన్నది పూర్వీకుల విశ్వాసం.

లోకంలో మానవులు దాత, అదాత అని రెండు రకాలుగా వుంటారు. ఇతరులకు అన్నం దానం చేసి తాను తినేవాడు దాత. ఇతరులకు దానం చేయకుండా విషపూరితమైన అన్నాన్ని తినేవాడు అదాత. దాతకు కాలంతరాన అన్నం లభిస్తుంది. అదాతకు కాలాంతరాన అన్నం లభించకపోగా, అగ్ని నశింపచేస్తాడని తైత్తిరీయబ్రాహ్మణం వివరిస్తుంది.

ఇతరులకు అన్నం పెట్టకుండా తానే తింటే, ఆ అన్నం విషంతో సమానం. దాత, అదాత ఇద్దరూ అన్నసంపాదనకు ప్రయత్నిస్తారు. కాని దాత ఇతరులకు దానం చేయడం కోసం అన్నం సంపాదిస్తాడు. అది ఉత్కృష్టమైనది. అదాత తాను తినడంకోసమే సంపాదిస్తాడు. అతను పాపాత్ముడు అని శ్రుతి పేర్కొంటోంది.

అన్నం దేవతే కాకుండా మృత్యురూపమైంది కూడా. మనం తినే అన్నాని బట్టే మనకు రోగాలు, ముసలితనం లభిస్తాయి. అన్నమే సంతానోత్పత్తికి కారణమని కూడా చెపుతుంది ఆయుర్వేదం. కాబట్టి ఇంత మహిమగల అన్నం ఇతరులకు పెట్టకుండా తాను మాత్రమే తినేవాడు ఒక రకంగా విషాన్ని భుజిస్తున్నట్టే.

యజ్ఞయాగాది క్రతువుల్లొ అగ్నికి ఆహుతి చేసే అన్నం 'మేఘం' అవుతుంది. అన్నమే మేఘం. సూర్యుడు తన కిరణాలచే భూమిమీదున్న నీటిని స్వీకరించి ఔషధులను, అన్నాన్ని సృష్టిస్తున్నాడు. ఆ అన్నంతోనే ప్రాణులన్నీ జీవిస్తున్నాయి. శరీరం బలాన్ని సంపాదిస్తుంది. ఆ బలంతోనే తపస్సు చేయగలుగుతున్నారు.

పరిశుద్ధమైన , ఏకాగ్రమైన మనస్సుగలవారికి తపస్సు సత్ఫలితాలనిస్తుంది. ముందు మేధస్సు, తర్వాత శాంతి, జ్ఞానం, విజ్ఞానం, ఆనందం, పరమానందం లభిస్తాయి.

కాబట్టే ఇన్నింటినీ సమకూర్చే అన్నదానం వల్ల సర్వ వస్తువులనూ దానం చేసిన ఫలితం వస్తుంది. ●



# మహిళా పారిశ్రామికులలో ఆణిముత్యం
# మహిళల్లో మరగత మాణిక్యం
# శ్రీమతి ఇందిరాదత్



ఆ రోజుల్లో మహిళాభ్యున్నతికి కృషి చేసిన తెలుగు తరుణీమణి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్! దుర్గాబాయ్ సేవలను గాంధీ, నెహ్రూలే ప్రశంసించారు.

వర్తమాన పరిస్థితులలో వనితలు స్వయం ఉపాధిని ఏర్పాటుచేసుకోవాలని ఉద్బోధిస్తూ ఆ దిశగా ఎంతో కృషి చేశారు శ్రీమతి ఇందిరాదత్.

ఆమె ముక్త్యాల రాజావారి కుమార్తె, రాజావారు దేశ సౌభాగ్యాన్ని కాంక్షించి నాగార్జున ఆనకట్ట నిర్మాణానికి ఎలా కృషి చేశారో, తెలుగు సాహిత్యాన్ని పోషించడానికీ ఆమె అలాటి విశేష కృషి చేశారు. పారిశ్రామిక రంగాలతో బాటు ఆమె విద్యారంగంలో కూడా అలుపెరుగని కృషి చేస్తున్నారు. చేసే పనులు పదుగురికి ప్రయోజనం ఉండేట్టు చేస్తారు. ఉపకార స్వభావం, ఉదార స్వభావం, ఆకాశ మంతమై అన్నట్లు ఆమె సేవలు దేశ సరిహద్దుల్ని కూడా దాటాయి.

## కెసిపి లిమిటెడ్‌కి మేనేజింగ్ డైరెక్టర్

ఒకపక్క వ్యాపార కార్యకలాపాలు, పనితీరు, అభివృద్ధి చూసుకుంటూనే సామాజికాభివృద్ధికి పాటుపడుతున్నారు.

సిమెంట్ ఉత్పత్తి, హెవీ ఇంజినీరింగ్, హైడెల్ విద్యుదుత్పత్తి, చక్కెర తయారీ, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ లను పర్యవేక్షించడం ఆమె వృత్తి.

విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, సంస్కృతీ పోషణ, భాషాభివృద్ధిల కోసం విశేషంగా కృషి చేయడం ఆమె ప్రవృత్తి.

## పారిశ్రామిక అనుభవం

1986 సెప్టెంబర్ నుంచి జూలై 1996 వరకు ఒకటి, రెండు యూనిట్ల సిమెంట్ ఉత్పత్తి డైరెక్టర్ గా వ్యవహరించారు.

సంస్థ ప్రమోటర్ వెలగపూడి రామకృష్ణ ఏర్పరచి, స్థిరపరచిన విలువలను అవగాహన చేసుకొని, ఉత్పత్తి పర్యవేక్షణ, వ్యవహారాలను నిర్వహించడంలో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా. వి ఎల్ దత్ నైపుణ్యాన్ని పుణికిపుచ్చుకొని 1996లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పదవిని చేపట్టారు.

2017 జూలై 1 నుంచి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గా ఉన్నారు.

కార్పొరేట్ వ్యవస్థలు, వ్యవహారాలపై నిర్ణయాధికారం ఆమెదే. ఆంధ్రప్రదేశ్ లోని ముక్త్యాలలో రెండవ సిమెంట్ ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన భూమి ఎంపిక, బిల్డింగ్ ప్లాన్, యంత్రాలు, అవసరమైన చోట రోబో వ్యవస్థ ఏర్పాటు, మార్కెటింగ్, సిబ్బంది, శిక్షణ, అభివృద్ధి వంటి అన్ని విభాగాలనూ వ్యూహాత్మకంగా ఏర్పరిచారు.

ఆమె కార్యదక్షత, ఆమె కలిగించే బృంద స్ఫూర్తితో ఏ ప్రాజెక్టు అయినా సకాలంలో పూర్తి కావలసిందే. ఇందుకు ఫలితంగా కెసిపి సంస్థ 'ఉత్తమ పారిశ్రామిక ఉత్పాదకత' పురస్కారాన్ని ఫ్యాప్సి (FAPCCI) నుంచి అందుకుంది. ఇందుకు గాను పండిట్ జవహర్ లాల్ నెహ్రూ రోలింగ్ షీల్డ్ ను సాధించుకుంది.

మాచర్ల ఉత్పత్తి కేంద్రం ఐ ఎస్ ఓ సర్టిఫికేషన్ ను పొందిన మొదటి సిమెంట్ సంస్థగా ఖ్యాతి గాంచింది.

గుంటూరులో ఐదు మినీ హైడెల్ విద్యుదుత్పత్తి కేంద్రాల పురోభివృద్ధికై ఇతోధికంగా కృషి చేశారు. ఈ హైడెల్, పవన విద్యుదుత్పత్తి వల్ల ఇంజినీరింగ్, సిమెంట్ ప్లాంట్లలో విద్యుత్తుకయ్యే ఖర్చు భారీగా తగ్గింది. దానితో అవి స్వయం సమృద్ధిని సాధించడమే కాక సంస్థకు లాభాలను చేకూరుస్తున్నాయి.

ఇక, స్థానిక వ్యవసాయదారులు, పరిపాలనా వ్యవస్థల సహకారంతో పరిశ్రమలు విజయబాట పట్టగలవని ఇందిరా దత్ నిరూపించారు. కెసిపి సంస్థకు వియత్నాంలో గల షుగర్ ప్లాంటే ఇందుకు నిదర్శనం.

2012 సెప్టెంబర్ నుంచి ఇందిరా దత్ ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలిగా ఉన్నారు. అందుకు సంబంధించిన విమెన్స్ బిజినెస్ ఫోరమ్ ను ప్రారంభించారు. 2012 ఆగస్టులో అది ఉనికిలోకి వచ్చింది. విజయవాడ, నెల్లూరు లలో సంస్థ చాప్టర్ లను ప్రారంభించారు.

2015 - 2016 సంవత్సరానికి గాను ఆంధ్ర, హిందూస్తాన్, మెడ్రాస్, నేషనల్, సౌత్ ఇండియా, తమిళ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లు సభ్యులుగా ఉన్న కన్సల్టేటివ్ కమిటీ చైర్మన్ గా కూడా ఆమె ఎంపికయ్యారు.

## కార్పొరేట్ సామాజిక బాధ్యత

తన వద్ద పనిచేసేవారికి వెన్నుదన్నుగా నిలవడం, సమాజాభివృద్ధికి పాటు పడటం అంటే ఇందిరా దత్ కి ఎంతో ఇష్టం. తమ సిమెంట్ ఫ్యాక్టరీల ప్రాంగణాల్లో సిబ్బంది పిల్లలే కాక, చుట్టుపక్కల ఉన్న ఇతరుల కోసం కూడా బడులను, పాలిటెక్నిక్ కళాశాలలను నెలకొల్పారు. ఆయా ప్రాంతాలతోపాటు అనేక ఇతర చోట్ల సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారు. మంచినీటి, వైద్య వసతులను కల్పించారు. కల్పించడమే

కాక ఎప్పటికప్పుడు వాటిని సమీక్షిస్తూ ఆధునీకరించడం ఆమె ప్రత్యేకత. వియత్నాంలో గల చక్కెర ప్లాంట్ అభివృద్ధి, నిర్వహణల విషయంలో ఆమె చూపిన చొరవ, తీసుకున్న నిర్ణయాలు అక్కడి వ్యవసాయదారులకు ఎంతో మేలు చేశాయి. చెరుకు ఉత్పత్తి విశేషంగా పెరగడం వల్ల ఐదు జిల్లాలలోని వ్యవసాయ బృందాల జీవన ప్రమాణాలు, సామాజిక స్థితిగతులు ఎంతగానో మెరుగుపడ్డాయి.

## సామాజిక అంశాలలో ఆమె సాధించిన ఘనతలు

కేసిపి గ్రూప్ ఆధ్వర్యంలోని అనేక ట్రస్టులు, ఫౌండేషన్ల కార్యక్రమాలను ఇందిరా దత్ పర్యవేక్షిస్తూంటారు.

2000 నుంచి వెలగపూడి ఫౌండేషన్ (చెన్నై) డైరెక్టర్‌గా... సామాన్యులకు వైద్య వసతులు అందేలా కృషి చేస్తున్నారు. విద్యా వ్యాప్తి జరిగేలా కార్యక్రమాలను రూపొందించి వాటిని పర్యవేక్షిస్తున్నారు.

1986 నుంచి రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యురాలిగా... ఆసుపత్రులు, మెటర్నిటీ కేంద్రాలు, కుటుంబనియంత్రణ కేంద్రాలు, డిస్పెన్సరీల స్థాపనలో కీలక పాత్ర పోషిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, సాంకేతిక శిక్షణ కేంద్రాలు, గ్రంథాలయాలు నెలకొల్పడంలో భాగం పంచుకుంటున్నారు. ఉపకార వేతనాలను అందించడం ద్వారా (స్కాలర్‌షిప్) పేదలకు ఉన్నతవిద్యను అందుబాటులోకి తెస్తున్నారు.

1985 నుండి వెలగపూడి కవితా ట్రస్ట్ (చెన్నై) సభ్యురాలిగా ఉంటూ ట్రస్ట్ తలపెట్టే సేవా కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

నేషనల్ అసోసియేషన్ ఫర ద బ్లైండ్ ఉపధ్యక్షురాలిగా 1992 నుంచి అంధులకు ఉపయుక్తమైన కార్యక్రమాలను చేపడుతున్నారు. వారికి ఉపయోగపడే పరికరాలను అందజేయడం, విద్య, వృత్తి విద్యా కౌన్సెలింగ్ ను ఏర్పాటు చేయడం, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ పథకాలు, అర్హులైన వారికి ఉద్యోగాల కల్పన, SIDCO ఎస్టేట్ (అంబత్తూర్)లో పారిశ్రామిక కార్యశాల (industrial workshop) నిర్వహణ వంటివి ఇందులో కొన్ని.

## 1992 నుంచి 2003 వరకు

స్పాస్టిక్ సొసైటీ ఆఫ్ తమిళనాడు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా సేవలందించి 2003 నుంచి అధ్యక్షురాలిగా ఉన్నారు. సంస్థ కార్యక్రమాలలో భాగంగా వికలాంగులకు, వారి కుటుంబాలకు మధ్య, ప్రభుత్వ, స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థల మధ్య అవగాహనను పటిష్టపరిచే కార్యక్రమాలను చేపడుతున్నారు. వికలాంగులను సమాజంలో భాగం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఇందిరా దత్ 1992 నుంచి 1993 వరకు ఫిక్కీ (FCO కొత్త ఢిల్లీ) మహిళా సంస్థకు అధ్యక్షురాలిగా సేవలందించారు. ఢిల్లీ కాకుండా ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తి అధ్యక్షురాలుగా ఎంపికైన మొదటి వ్యక్తి ఈమే కావడం విశేషం. ఇది తెలుగువారిగా మనకు గర్వకారణం. ఇలా ఎంపికై కొన్ని ఘనతలను సాధించారు. చెన్నై, కోయంబత్తూరు, హైదరాబాద్‌లలో సంస్థ మొదటి చాప్టర్‌ను ఏర్పాటు చేశారు. మహిళా వ్యాపారవేత్తలు తయారు చేసిన పలు ఉత్పత్తులకు ఢిల్లీలో ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేశారు. భారతీయ మహిళా entrepreneur ల బృందాన్ని అమెరికా తీసుకెళ్ళిన మొదటి మహిళా entrepreneur అయ్యారు. సంస్థ అంతర్ రాష్ట్ర సమావేశాన్ని నిర్వహించి, చెన్నై కాకుండా ఇతర నగరాలలో వ్యాపారాభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ వార్షిక సమావేశానికి కేంద్ర ఆర్థికమంత్రిని ఆహ్వానించిన మొదటి అధ్యక్షురాలయ్యారు. మహిళలను వ్యాపారవేత్తలుగా, నిర్వాహక నైపుణ్యం కలిగినవారుగా తీర్చిదిద్దే సంస్థగా, వారి సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు కృషి చేసేదిగా FCO స్థాయిని పెంచారు. ఇందుకోసం సెమినార్లు, సమావేశాలు, కోర్సులు, కార్యశాలలు నిర్వహించారు.

ఇంకా... 2007 నుంచి 2010 వరకు సార్క్ ఛాంబర్ విమెన్ ఎంట్రప్రెన్యూర్స్ కౌన్సిల్ (SCWEC)కి భారతదేశం నుంచి ఎంపికైన మొట్టమొదటి అధ్యక్షురాలిగా ఉండి ప్రస్తుతం సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ఆంధ్ర.



శ్రీ వి.ఎల్.దత్, శ్రీమతి ఇందిరా దత్, కుమార్తె శ్రీమతి కవితాదత్

# నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంకు మూలం మహానుభావుడు గురించి తెలుసుకోవాలని ఉందా?

ఈ క్రింది ఫోటోలోని పుణ్యమూర్తిని రోజు స్మరించుకోండి, వారి చిత్రపటానికి రోజూ నమస్కరించండి, కొంచెం కష్టపడి అయినా ఓపికగా వారి చరిత్ర చదవండి.




ఎందుకంటే ఆయన మహానుభావుడు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ముఖ్యంగా నల్లగొండ, గుంటూరు, ఖమ్మం, కృష్ణా జిల్లాలలో మనం ఈ రోజు సుభిక్షంగా పాడి పంటలతో ఉన్నామంటే వారే కారణం, వంశపారంపర్యంగా వచ్చిన రాజరికంతో తృప్తి చెందలేదు.

ప్రజలకు పది కాలాలు ఉపయోగపడాలన్న సదుద్దేశంతో, తన సొంత ఖర్చులతో వూరు వూరు తిరిగి రైతులను చైతన్యం చేసి కృష్ణా ఫార్మర్స్ సొసైటీ ని స్థాపించి నాగార్జున సాగర్ వద్ద (నందికొండ వద్ద) ఆనకట్ట కడితే బహుళార్ధసాధకంగా ఉపయోగపడి ఆనీటితో పంటలు పండించుకుని కరువులు దూరం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి అయి తెలుగునేల అన్నపూర్ణగా, భారత దేశ ధాన్యగారంగా మారుతుందని తలంచి, అనకట్టలు ఆధునిక దేవాలయాలని భావించి బ్రిటీష్ ప్రభుత్వానికి నివేదించి నాగార్జున సాగర్ నిర్మాణంపై పాలకుల దృష్టి పడేలా చేశారు.

ఈలోగా దేశానికి స్వాతంత్ర్యం రావడంతో, కేంద్ర ప్రభుత్వం వద్దకు రైతులను పెద్ద సంఖ్యలో తీసుకెళ్లి గాంధీజీ గారికి నాటి ప్రధాని జవాహర్లాల్ నెహ్రూ, పటేల్ దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ పరిశీలనకై ఒక ఖోస్లా కమిటీని నియమించింది.

ఆనాడు కీకరణ్యంగా ఉన్న ప్రాజెక్ట్ ప్రదేశానికి తన సొంత ఖర్చులతో విజయవాడ నుండి దారి నిర్మించి వారికి ఆప్రదేశాన్ని, అక్కడి కృష్ణమ్మ జల సిరిని చూపి ఆ కమిటీని ఒప్పించి ప్రధాని జవాహర్లాల్ నెహ్రూ గారితో 1955లో నాగార్జునసాగర్ నిర్మాణానికి పునాది రాయి వేయించి పూర్తి అయ్యే వరకు పర్యవేక్షించి దేశంలోని ఓ పెద్ద బహుళార్ధక ప్రాజెక్ట్‌ను నిర్మింప జేసిన మహానుభావుడు.

ఈ నాలుగు జిల్లాలో ప్రజలు ఈరోజు అన్నం తింటున్నారంటే ఆ మహానుభావుని చలవే,

ఆ మహానుభావుడే గౌరవ శ్రీశ్రీ రాజా వాసిరెడ్డి గోపాలక్రిష్ణ మహేశ్వర ప్రసాద్, జగ్గయ్యపేట వద్ద గల ముక్త్యాల సంస్థనాధీశుడు, మనందరి దేవుడు మనం తినే ప్రతి మెతుకులో వీరిని స్మరించుకోవాలి, వీరి గాథ పిల్లలకు చెప్పండి, మిత్రులతో పంచుకోండి. వీరే మన ఇందిరాదత్ గారి తండ్రిగారు.

మహిళా సభ (చెన్నై) సలహాదారుగా, 1985 నుంచి గాంధీ నగర్ లేడీస్ క్లబ్ అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు.

ఇక వరల్డ్ తెలుగు ఫెడరేషన్‌తో అమెకు గల అవినాభావ సంబంధం ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అంశం. 2003 నుంచి ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలుగా ఆమె చేసిన కృషి, సాధించిన ప్రగతి నభూతో న భవిష్యత్తుగా అభివృద్ధి చెందింది. శ్రీమతి ఇందిరాదత్ గారి అధ్యక్షతన, దుబాయ్, సింగపూర్, మలేషియాలో ద్వైవార్షిక సభలు నలుగురు మెచ్చుకునే విధంగా జరిగాయి. అంతేకాదు విదేశాలలో జరుగుతున్న వాటికి తగ్గట్టుగానే ఆ సాంస్కృతిక కార్యక్రమాలు కూడా కళాకారులను అతిథులను ఇక్కడనుండీ తీసుకువెళ్ళి విదేశాలలోని తెలుగువారికి ఎనలేని ఆనందాన్నివ్వడం ఆమెకు ఆమే సాటి అనిపించారు. విదేశాలలోని సభలే కాక ఇండియాలో బెంగుళూరు, విజయవాడ, విశాఖపట్టణంలోని తెలుగు మహాసభలు నిర్వహించిన ఘనత శ్రీమతి ఇందిరాదత్ గారిది. ఇవన్నీ ఒక ఎత్తయితే WTF ద్వారా విశాఖపట్టణంలో నెలకొల్పి తెలుగు హెరిటేజ్ మ్యూజియం, అందులో తెలుగు భాష, సంస్కృతి సాంప్రదాయాల కోసం శాతవాహనుల కాలంనుంచి ప్రస్తుత కాలం వరకు చేసిన కృషిని అందులో నిక్షిప్తం చెయ్యాలని ఆమె దీక్షబూని దానిని సాధించారు. ఇది ఆమె కిరీటంలో మహా కలికితురాయి.

ఎన్ని తరాలైనా తరగని సిరీసంపద, ఏ ఆస్తి ఏ ప్రక్కన ఉన్నదీ ఏ పరిశ్రమ ఎక్కడ ఏ దిశలో ఉన్నది చెప్పలేము. అన్ని దిశలా కె.సి.పి. పరిశ్రమలున్నాయ్. విద్యాలయాలున్నాయ్. వృత్తి శిక్షణా శాలలున్నాయ్. తద్వారా ఎన్నో వేల కుటుంబాల వారు ఉపాధిని పొందుతున్నారు.

ఆమె దుర్గాబాయమ్మ నెలకొల్పిన ఆంధ్ర మహిళా సభ ట్రస్టు బోర్డు మెంబర్. రాజా అన్నామలైపురంలోని దత్తాత్రేయ ఆర్థోపిడిక్ కేంద్రం ద్వారా విదేశాల్లో కూడా పేదలకు ఎన్నో వైద్యసేవలు అందచేస్తున్నారు.

సిరిమల్లె పువ్వులా నవ్వు – అన్నట్లు ఆమె సిరి పారిజాతంలా వుంటుంది. ఆ నవ్వు సలలిత శీతల కిరణంలా ఉంటుంది. ఆమెకు పెద్దా పిన్నా తారతమ్యాలు లేవు. చిత్తశుద్ధితో పనిచేసేవాళ్లంటే అపారగౌరవం.

ఆమెకు ఎన్నో సత్కారాలూ, బిరుదులూ, అవార్డులూ లభించాయ్. వాటన్నిటినీ ఆమె చెప్పుకోరు. ఎప్పుడైనా సందర్భం కలిగి యెలా చేయకలుగుతున్నారమ్మా అంటే ఓ నవ్వు నవ్వేస్తారు; నవకోటి చంద్ర కిరణాలు ఆ నవ్వులో తేలియాడతాయ్. అపార ప్రజ్ఞా పాటవాలు గల మహిళ ఇందిరాదత్. ఇంతటి ప్రజ్ఞాపాటవాలు గల శ్రీమతి ఇందిరాదత్ గారికి పద్మభూషణ్ ఇవ్వాలని నాన్నగారు 2010లో ప్రముఖాంధ్రలో రాశారు. ఆయన మాట తథాస్తు కావాలని నా కోరిక.

"స్వంత లాభం కొంత మానుకుని పొరుగువారికి తోడుపడవోయ్" అని సమాజానికి మనమేం చేయ కలుగుతున్నాం అనే ఆలోచనే శ్రీమతి ఇందిరాదత్ గారి ఆలోచన. అందుకనే ఆవిడ ఎన్నుకున్న కార్యక్రమం నలుగురికి ఉపయోగపడేలా చెయ్యడమే ఆవిడ ప్రత్యేకత. ●

# మనం మనలాగే ఉండాలి... విజ్ఞానం??



అది బ్రిటిష్ కాలం... ఒక పిల్లవాడు స్కూల్ నుండి ఏడుస్తూ ఇంటికి వచ్చాడు. "స్కూళ్ళో కొందరు పోకిరీ పిల్లలు పిలక పంతులు అని వెక్కిరిస్తున్నారమ్మా... పిలక తీసేస్తానమ్మా" అని చెప్పి ఏడ్చాడు.

చూడు నాన్నా.. "నీ పిలక వలన వాళ్ళకి ఏ నష్టమూ లేదు. పిలక ఉన్నందుకు నువ్వు బాధ పడక్కరలేదు. ఎవరో మూర్ఖులు ఏదో అన్నారని మన అస్తిత్వాన్ని మనం పోగొట్టుకోకూడదు. వాళ్ళు వెక్కిరించారని నువ్వు పిలక తీసేస్తే నీ మీద నీకు గౌరవం లేనట్టే. అవన్నీ పట్టించుకోకుండా చదువు మీద దృష్టిపెట్టు నీ వలన దేశానికి చాలా ఉపయోగముంది" అంది.

కొంతకాలం తరువాత... "అమ్మా స్కూళ్ళో పిల్లలు నన్ను జంధ్యం మాష్టారు... జంధ్యం మాష్టారు అంటూ వెక్కిరిస్తున్నారు.. అస్తమానూ జంధ్యం పట్టుకొని లాగుతూ అల్లరి చేస్తున్నారు" అంటూ మళ్లీ ఏడ్చాడు.

"నీ జంధ్యం బయటకు రాకుండా చొక్కాలు కుట్టిస్తాను నాయనా... బాధపడకు. వాళ్ళ చేతలు, వాళ్ళ మాటలు పట్టించుకోకు. నువ్వు గొప్పవాడివి కావాలంటే ఇలాంటి చిన్న చిన్న విషయాలకు కుమిలిపోకూడదు. రాళ్లు అడ్డొచ్చాయని ప్రవాహం ఆగిపోతుందా...?" అని అనునయించింది.

మరికొంత కాలం గడిచాక ఆ పిల్లాడు ఇంకా పెద్ద చదువులు చదవడానికి దూరప్రాంతానికి వెళ్ళాడు. మళ్ళీ అలాంటి సమస్యే ఎదురయ్యింది. "అమ్మా ! ఇక్కడి వాళ్ళు కోడిగుడ్లు తినమని నన్ను పోరుపెడుతున్నారు. బెదిరిస్తున్నారు. సభ్యత లేకుండా మాట్లాడుతున్నారు. నేను తినే భోజనంలో కోడిగుడ్డుని కలిపేస్తున్నారు. మనసుకి చాలా కష్టంగా ఉందమ్మా" అని ఉత్తరం రాసాడు.

"వాళ్ళు ఎన్నిరకాల పన్నాగాలు పన్నినా నువ్వు చలించకు. వాళ్ళు కాకుల వలే గోలచేస్తే చెయ్యనీ, దోమల వలే రొదపెడితే పెట్టని... వాళ్ళు అలాగే మిగిలిపోతారు. కానీ నువ్వు దేశచరిత్రలో మహానుభావుడిలా నిలిచిపోవాలి. ఏకాగ్రత కోల్పోకు.. నీ చదువుని ఒక తపస్సులా భావించు. ఉదయాన్ని చూడాలంటే చీకటిని భరించాలి. ధృఢమైన సంకల్పంతో ముందుకెళ్లు" అని ఆమె తిరుగు ఉత్తరం రాసింది.

తల్లి రాసిన ఉత్తరం చదివిన అతడు కొండంత బలంతో చదువు పూర్తిచేశాడు. కేంబ్రిడ్జికి వెళ్ళాడు. ప్రపంచదేశాలు మనివ్వెరపోయేలా భారతదేశపు ఖ్యాతిని ఆకాశంలో నిలబెట్టాడు.

అతడే **విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త "సి.వి.రామన్".** తన తల్లి చెప్పిన విలువలను, హితోక్తులను ఆయన తన జీవితకాలం పాటించారు. విదేశాలకు వెళ్లినా, ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా, మద్రాస్ ఐ.ఐ.టి.కి వైస్ ఛాన్సేలర్‌గా ఉన్నా కూడా ఆయన ఎప్పుడూ తన పిలకని తీయలేదు. భారతీయతను వదిలిపెట్టలేదు. అందుకే తలపాగా ధరించేవారు.

**"RAMAN THE GREAT."**

# గొప్పవారి వ్యంగ్యాస్త్రాలు, చెమత్కారాలూ కూడా గొప్పగానే వుంటాయి??



ఒకసారి కవిసమ్మేళనం జరుగుతోంది. కవులందరూ విచ్చేసారు. మహాకవి శ్రీ విశ్వనాధ సత్యన్నారాయణ గారూ కూడా సభకు విచ్చేసారు. ఆయన్ని చూసి కవులందరూ వారిని సగౌరవంగా స్వాగతించారు.

జాషువా మాత్రం ఏదో పుస్తక పఠనంలో ఉండిపోయారు.

ఆదిచూసిన విశ్వనాధ వారు జాషువాను ఉద్దేశించి,

"పక్షి నారాకను గమనించలేదు" అన్నారు.

అది విని కవులందరూ ఇంతటి మహాకవి జాషువాని పక్షి తో పోలుస్తారా అని ముక్కున వేలు వేసుకున్నారు.??

కానీ జాషువా మాత్రం చిరునవ్వుతో లేచి విశ్వనాధవారికి నమస్కరించి, "మీలాంటి కిరాతకుల దృష్టి ఎప్పుడూ పక్షులమీదే కదా" అన్నారు.

విశ్వనాధుని ఈ జాషువా అంత మాట అంటాడా అని కవులందరూ నిశ్చేష్టులయ్యారు.

కానీ జాషువా అన్న మాటకి విశ్వనాధులు పగల పడి నవ్వేశారు.

దీని అంతరార్ధం ఏమిటంటే.. జాషువాని పక్షితో ఎందుకు పోల్చేరంటే జాషువాకి ఆ సభలో "కవి కోకిల" (పక్షి కదా) అనే బిరుదు ఇస్తున్నారు. అందుకే జాషువాకి కోపం రాలేదట.??

ఇక జాషువా విశ్వనాధుని కిరాతకుడు అన్నారు.

కిరాతకుడు అంటే విశ్వనాథులవారు "శ్రీ రామాయణ కల్పవృక్షం" అని రామాయణం రాస్తున్నారు అందుకు జాషువా ఆయన్ని (కిరాతకుడు) వాల్మీకితో పోల్చాడు.??

ఇంకో విషయం. జాషువా విశ్వనాధుల వారి అనుంగు శిష్యుడు !!


## రుచులు అడగడం దేనికి ! ప్రముఖాంధ్ర రజతోత్సవ విశేష సంచిక ఎదురుచూడండి!

- త్వరలోనే వెలువడనున్నది. ప్రముఖాంధ్రుల ప్రతిభా విశేషాలనూ, త్రిలింగ దేశంగా విరాజిల్లిన ధార్మిక సంస్కృతినీ, విపులంగా, మేమెరింగినంత విశదంగా, చిత్తరువులతో, చిత్ర విశేషములతో వెలువరించే కృషి జరుగుచున్నది.

మీమీ అమూల్య రచనలనూ, ఇరవై ఐదు సంవత్సరాలుగా మీరు పొందిన అనుభూతుల్ని మీ ఫోటో వివరాలతో పంపండి. మీతో ఓ పదిమందిని ఉపకార చందాదారులు (రూ. 2,116లు) గానూ చేర్చండి. ప్రపంచమంతా ప్రముఖాంధ్రుల మయం కావాలి, ప్రముఖాంధ్రుల తేజం ప్రపంచమంతా విరియాలి.

# శ్రీ భోగరాజు సత్యనారాయణ త్యాగానికి మారుపేరు

**శ్రీ రామ నామ లేఖనాన్ని కొన్నివేల మంది చేత వ్రాయిస్తూ - అదే మహాయజ్ఞంగా భావిస్తున్న కర్మయోగి.**



ఎందరో యోగులు, ఋషీశ్వరులు సిద్ధులు అవతార పురుషులు ఈ పుణ్యభూమి యందు జన్మించి ఈ లోకమునకు మార్గదర్శకులై మానవాళి నుద్ధరించి ఆచంద్రార్కము కీర్తిమంతులై వెలుగొందుచున్నారు. ఆ దేవదేవుని కృపతో – ఈ నాటికినీ ఎందరో మహానుభావులు జన్మించి పరమేశ్వరాజ్ఞ ప్రకారము తాము వచ్చిన పనిని నేరవేర్చుకొని కృతకృత్యులై భావితరములకు ఆదర్శముగా నిలిచి చరిత్రలో సుస్థిర స్థానమును సంపాదించుకున్నారు. అందుల కనుగుణంగా ఆ పరమేశ్వరుడు భోగరాజువారి వంశమును ఉద్ధరింపదలచి – ఒక మహోన్నత వ్యక్తిని జన్మింపజేసెను. అతడే భోగరాజు సత్యనారాయణ. ఇతని జన్మస్థలము పవిత్ర గోదావరి తీరమున నున్న పోతునూరు గ్రామము. పోతునూరు కరణంగారు శ్రీభోగరాజు రామకృష్ణమూర్తి, శ్రీమతి సామ్రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించిన ప్రథమ పుత్రుడు. జననం 31–10–1941. ఈయన జన్మించిన రోజు. మన హిందువులు పవిత్రంగా భావించే క్షీరాబ్ధి, ద్వాదశి మహాపుణ్యదినం. 'పురుషులందు పుణ్య పురుషులు వేరయా' అని చెప్పినట్లు ఈ బాలుడు పుట్టుక నుండే భగవంతునియందే అంతర్ముఖుడై వుండేవాడు. మిత భాషి – ఏదో చేయాలి ఏదో సాధించాలి అన్న తపనతోనే వుండేవాడు. ఉద్యోగరీత్యా నాగార్జునసాగర్‌లో జూనియర్ ఇంజనీర్‌గా ఉన్నప్పుడు శ్రీభోగరాజు సత్యనారాయణగారు వారి అక్కబావగార్ల ఇంట్లో (నాగార్జున సాగర్) ఉండేవారు. ఆయన బావగారు శ్రీతిమ్మరాజు లక్ష్మీనరసింహారావు గారి మాట సత్యనారాయణగారికి వేదవాక్కు. ఆయనే బావమరిదికి ఎటువంటి పెళ్ళి కూతురు కావాలో చెప్పేవారు. అప్పట్లో సత్యనారాయణ గారు సెలవులకు పోతనూరు నుండి ఏలూరుకు బస్సులో వెళుతూండగా అందులోనే ఆయనకు కాబోయే శ్రీమతి సాక్షాత్కరించింది. ఆయన కోరుకున్న విధంగానే వున్న ఆ అమ్మాయిని చూసి ఆ క్షణంలోనే ఆమె తన భార్య అని నిర్ణయించుకున్నారు. తర్వాత వాకబు చేసి మధ్యవర్తులతో రాయబారం జరిపి ఆమె కందికొండ మిత్ర విశ్వప్రకాశరావు గారి మూడవ పుత్రిక అని తెలుసుకొని పెద్దల అంగీకారంతో వారి సమక్షంలో 13–5–1966న శ్రీ సూర్య ప్రభగారితో పాణిగ్రహణం జరిగింది.

ఆ వివాహం జన్మజన్మల బంధం. పెళ్ళయినప్పటి నుండి వారిద్దరూ ఒకరి కోసమొకరన్నట్లుగా జీవించారు. వారు తిరగని పుణ్య క్షేత్రాలు లేవు. చేయని నోములు లేవు. ఆ సేతు హిమాచల పర్యంతమూ అష్టాదశ శక్తి పీఠాలూ, ద్వాదశి జ్యోతిర్లింగాలూ, కైలాస మానసరోవర యాత్ర, కాశ్మీర్, కేధార్‌నాథ్ యాత్ర, నేపాల్ ముక్తినాథ్ యాత్రలు చేసి దర్శించుకుని పునీతులయ్యారు అన్నీ దంపతీ సమేతంగానే. ఇది చాలా అరుదైన విషయం. వారిద్దరికీ ఇది కడపటి జన్మ యేమో అన్నట్లుగా వారిని బంధవిముక్తులగా చేయటానికన్నట్లు వారికి సంతానాన్ని భగవంతుడు ప్రసాదించలేదు. అందుకు తీవ్రంగా పరితపించిన సూర్యప్రభగారు తన భర్తని పునర్వివాహం చేసుకొమ్మని మన ఃపూర్వకంగా కోరింది. పట్టుపట్టింది. ఏడ్చింది. ప్రాణ త్యాగానికి సిద్ధపడింది. ఆయనను అనేక విధాల ప్రార్థించింది. అంత స్వార్థరహితమైన ఇల్లాలు. సత్యన్నారాయణగారు అంతకుమించిన ధీరో దాత్తులు. మనకు సంతానం లేకపోయినా ఫర్వాలేదు. మనసా వాచా కర్మణా జన్మ జన్మలకీ నీవే నా భార్యవు. నీ స్థానంలో మరొకరిని కలలో కూడా ఊహించలేను. మనది జన్మజన్మల బంధం అని ఆమె అభ్యర్థనని తిరస్కరించారు. ఆయన జీవితంలో భార్య మాటను వినకుండా వుండటం ఇదే ప్రథమం.

మమతల వనంలో ఆయనకు ఆమే ఓ దేవత! మన్నికైన స్వభావంతో ఆమే ఓ ప్రేరణ! ఆయనే ఓ కవైతే ఆయన కలానికి ఆమే స్పందన. ప్రతీ ఆలోచనకు ఆలంబన! అతనికి ఆమే సర్వస్వం. అమ్మలా, ఆలిలా, ఆత్మీయ బంధువులా, చెలిలా అణువణువు ఈ జగతిలో ఆయనకు ఆమె ఓ ఆత్మీయ స్పర్శ. ఆమె సకల కళానిధి. ఆమెను ఆరాధించే, ప్రోత్సహించే పూజారి ఆయన, వారిద్దరు ఎందరికో ఆదర్శం. ఆమె లేకపోయినా ఆమెనే ఆరాధిస్తూ, ఆమె పిలుపు కోసం ఎదురుచూస్తూ, భూలోకంలో ఆయన, పైలోకంలో ఆమె! వారిద్దరు ఒకరికోసం ఒకరు పుట్టారా అనేంత ప్రేమస్వరూపులు.

అంతేకాక ఆయన యోగవిద్యలో ప్రవీణులు. దాదాపు 100 ఆసనాలను అవలీలగా వేసేవారు. వారి సతీమణి సూర్యప్రభగారు కూడా ఆయనకు ధీటుగా అన్ని యోగాసనాలనూ అవలీలగా చేసేది. సత్యనారాయణ గారి కోసమే అన్నట్లుగా వివాహానికి ముందునుండీ యోగాసనాలు నేర్చుకొన్నారు. ఆమెకు దైవం గానమాధుర్యాన్ని కూడా ప్రసాదించాడు. ఏపాటైనా పద్యమైనా అవలీలగా అనుసరించేది. సుమారు 500 పాటలు (భక్తి, పౌరాణిక, పాత సినిమాలు) పాడింది. భర్తగా ఆ గానమాధుర్యాన్ని ఆయన Record చేసి, CDలలో నిక్షిప్తం చేసారు. ఈ నాటికీ ఆమె తన వద్ద వుంటున్నట్లుగానే His Master Voice ఆమె పాటలని వింటూ ఆమెతో గడిపిన క్షణాలను తలచుకుంటూ శేషజీవితాన్ని గడుపుతున్న కర్మయోగి. ఈ పాటలను suryaprabhabhogaraju/ babjiprabhabhogaraju youtube లో వినవచ్చు. ఆమె శ్రీరామనామాన్ని కోటికి పైగా వ్రాసి ధన్యురాలైన పుణ్యమూర్తి. అందుకు ప్రోత్సాహమిచ్చి ఆమెతో వ్రాయించిన ఘనత శ్రీభోగరాజు సత్యనారాయణ గారిది. దాదాపు ఒకటిన్నర కోటిసార్లు శ్రీరామ నామాన్ని ఆమె వ్రాసారు. ఎంతైనా విధి బలీయమైనది. విధిని ఎవరూ తప్పించలేరు. ఆమె చివరి రోజుల్లో సుమారు ఒక నెల రోజులు సుస్తీగా వుండి 12–10–2015న భాద్రపది మహాలయ అమావాస్యనాడు బంధవిముక్తురాలై స్వర్గలోకంలో తన పతిదేవుని కోసం నిరీక్షిస్తున్న దేవత. ఆమె జీవించిన సమయం 70 సంవత్సరములు 7 నెలలు 7 రోజులు 7 గంటలు 7నిమిషములు 7సెకండ్లు.



భోగరాజు సత్యనారాయణ, సూర్యప్రభ దంపతులు

శ్రీభోగరాజుగారు దూషణ భూషణములను సమ బుద్ధితో ఆదరించిన ఉత్తముడు. ఎందరు అవమానించినా ఎన్ని అపకారాములు చేసినా– సహృదయంతో వారిని క్షమించి వారికి ఉపకారము చేసినవారు.

ఆమె జ్ఞాపకార్థం ఎన్నో దాన ధర్మాలు చేసారు. కష్టపడి సంపాదించి దాచుకున్న డబ్బుతో సుమారు 50 లక్షల రూపాయల పైగా దేవాలయాలకి, అన్నదానాలకీ, వృద్ధుల సంక్షేమం కోసం, బ్రాహ్మణుల బాగు కోసం ఖర్చు చేసారు. ఆమె జ్ఞాపకార్థం ప్రభారాధన అనే లఘుచిత్రాన్ని తీసారు. (39 నిమిషాల నిడివి) భార్యాభర్తలు ఎలా జీవించాలో - ఎలా ఆదర్శ దంపతులుగా మెలగాలో అన్నదే సారాంశం. దీనిని youtube లో bhogaraju productions అని వెతికి చూడవచ్చు.

ఆమె తనకు దూరం అయినప్పటి నుంచి ఆయనకి ఇతర వ్యాపకాలేమీ లేవు. ఆమె ఆరాధన తప్ప, ఆమె పాడిన పాటలు వింటూ, ఆమె చెప్పిన హరికథలు వింటూ, ఆమె చేసిన చిత్రాలు చూస్తూ, ఇల్లంతా ఆమె ఫోటోలతో నింపేసి, తన లోపల, బయట అంతా ఆమే అన్నట్లు జీవించటం తప్ప, టి.వి.లు లేవు, న్యూస్‌పేపర్లు లేవు, షికార్లు లేవు, సినిమాలు లేవు, బయటికి వెళ్ళేది లేదు. ఇదే క్రొత్త ప్రేమ కథ. ఇదో మిధునం. వారు వ్రాసిన పుస్తకం చదివితే విడిపోవాలనుకున్న భార్యాభర్తలు కలుస్తారు. ఆమె మీద షార్ట్ ఫిల్మ్స్ తీశారు. తన ప్రేమను ఇలా చాటుకుంటున్నారు.

రామనామ లేఖనాన్ని ఒక మహాయజ్ఞంగా భావిస్తూ అనేక వేలమంది చేత శ్రీరామనామాన్ని వ్రాయిస్తున్న ఒక పుణ్యజీవి. దాదాపు 10,000 రామనామ పుస్తకాలను ఉచితంగా వితరణ చేసిన మహాను భావుడు. ఇంకా ఈ శ్రీరామనామ లేఖన యజ్ఞాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తూనే వున్నాడు. ●

రామకోటి పుస్తకాల కొఱకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

**శ్రీ భోగరాజు సత్యనారాయణ**

**8143236195 / 9246663195**

**మహారాజశ్రీ 'ప్రముఖాంధ్ర' పఠితలారా!**

**అభివందనములు. ఇది ప్రముఖాంధ్ర - 25వ వత్సరపు - 10వ సంచిక - అనగా 298వ మాసపు 298వ సంచిక. ఇంతవరకూ నూటికి 90 మంది 'ప్రముఖాంధ్ర'ను ఉచితంగా అందుకుంటూనే ఉన్నారు. విదేశాలకు 'ప్రముఖాంధ్ర' పంపించడానికి రూ. 60/-లు వ్యయమగుచున్నది. పత్రిక మూల్యం రూ. 20/-లు అవుతున్నది. తెలుగు భాషకు సేవ చేస్తున్న మామీద ఇంకనూ ఇంత ఆర్థిక భారం మోపడం ధర్మమేమో మీరే ఆలోచించండి.**

**తెలుగువారిలో ఎంతోమంది శ్రీమంతులూ, ఉదారులూ ఉన్నారు. ప్రకటనరీత్యా, విరాళముల ద్వారానూ సహకరించవచ్చును. రూ. 25,116, రూ. 15,116/-, రూ. 10,116, రూ. 5,116లూ అభిమాన చందాగా పంపండి.**

**ఏవీ లేకపోయినప్పటికినీ నెలకొక రూ. 20ల్ను, సాలుకు రూ. 200/-లు పంపండి. ఇంతకూడా పంపలేనివారు మా పఠితల్లో ఉండరని మా విశ్వాసం. అందరికీ ఇదే మా అభ్యర్థనం.**

**- గోటేటి వెంకటేశ్వరరావు**

# సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రిగారు...



ఆ మహానుభావుడు గతించి ఈయేడాదితో నూటరెండు సంవత్సరాలు పూర్తి అవుతోంది. ఆయన పరమపదించిన 1917వ సంవత్సరం నుండీ ఈనాటివరకూ ఆయన శిష్యవర్గం, ప్రతి ఏడూ క్రమంతప్పక, వారి వర్ధంత్యుత్సవాలు జరుపుతూనే ఉన్నారు. నిజానికి త్యాగరాజస్వామికే దక్కని అదృష్టాన్ని స్వంతంచేసుకున్న ఆయన ఎవరు? ఆయన చేసిన ఘనకార్యమేమిటి?

ఆయనే కృష్ణాజిల్లా పెదకళ్ళేపల్లికి చెందిన సంగీత సద్గురువు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రిగారు... సాక్షాత్తూ త్యాగయ్యగారి ప్రశిష్యులు.

ఆయన తాతగారైన రామమూర్తిశాస్త్రిగారు, గొప్ప సంస్కృత,వేద పండితులు. కడు పేదరికంతో కుటుంబ భారం మోయలేని స్థితిలో ఉన్న ఆయన, నైజాం నవాబుగారిని ఆశ్రయించగా, వీరి ప్రతిభకు ముగ్ధుడై, నవాబుగారు అయిదు గ్రామాలను బహుమానంగా ఇచ్చారు... వాటిలో ఒకటి పెదకళ్ళేపల్లి అగ్రహారం. 1860 వ సంవత్సరం, 'దక్షిణ కాశీ' గా ప్రసిద్ధమైన పెదకళ్ళేపల్లిలో జన్మించారు దక్షిణామూర్తి శాస్త్రిగారు. సంగీతం ఆయనకు ఆరోప్రాణం. చిన్నతనంలో ఒకసారి శాస్త్రిగారు బందరులో ఒక తమిళ అయ్యరుగారి కచేరీ వినటం జరిగింది. అయ్యరు గారి పాటలో సంగీతపరమైన దోషాలు కనబడ్డాయి శాస్త్రిగారికి. అయితే, అందరూ 'శభాషని' మెచ్చుకుంటుంటే, ఆ దోషాలను విశ్లేషించలేకపోయారు శాస్త్రిగారు. ఆ క్షణానే ఒక నిశ్చయానికొచ్చారు. ఎలాగైనా సంగీత శాస్త్రం అభ్యసించాలి. అయితే... ఆనాడు తెలుగునాట, సంప్రదాయ సంగీతం చెప్పే గురువులు లేరు.

మొక్కవోని పట్టుదలతో, కాలినడకన, వందల మైళ్లు ప్రయాణంచేసి, తంజావూరు చేరుకున్నారు. అక్కడ త్యాగయ్యగారి మేనల్లుడు, ప్రియశిష్యుడు ఆకుమడుల (మానంపూచావడి) వెంకటసుబ్బయ్య గారి గురుకులంలో ప్రవేశించారు. అనేక విధాల పరీక్షించిన పిమ్మట, శాస్త్రిగారికి సంగీత శిక్షణను ప్రారంభించారు సుబ్బయ్యగారు. తెలుగునాటనుండి విద్యార్థియై వచ్చిన అంధులైన ఫ్లూటు శరభ శాస్త్రిగారితో కలిపి, రోజూ పాఠం జరిగేది.

కొంతకాలం గడిచింది...

సుబ్బయ్యగారు వయోవృద్ధులైనారు. ఒకనాడు వీరిద్దరినీ పిలిచి, 'నాయనా! మీ ఊరిని, కన్న వాళ్లనూ వదలి, ఇంతదూరం సంగీతంకోసం వచ్చిన మిమ్మల్ని చూస్తే నాకెంతో ఆనందం కల్గుతుంది. మీమీద నాకు అపారమైన నమ్మకముంది. నాకు ఇక ఏక్షణనైనా భగవంతుడినుండి పిలుపురావచ్చు. నాకు మీరు ఇరువురూ ఒక ప్రమాణం చేయాలి. నాకు ఎవరూలేరు. నా తదనంతరం, మీ గురుపత్ని బాధ్యత మీరు తీసుకోవాలి. మీకు నా సంగీత గ్రంథం అప్పగిస్తాను. శ్రద్ధాభక్తులతో నేను చెప్పినట్లు చేయండి. శాస్త్రీ! నీవు ఏకసంథాగ్రాహివి కనుక, పాఠాన్ని వ్రాసుకుంటూ నోటితో వల్లించు. నీకు కంఠస్థమౌతుంది. మరొకసారి, వ్రాసిన పాఠం ఇరువురూ కలసి పాడండి. అంధుడు, ద్విసంథాగ్రాహి అయిన శరభశాస్త్రికి అప్పుడది పట్టుపడుతుంది. ఈవిధంగా ప్రతిరోజూ చేయండి. నా ఆశీస్సులు సదా మీకుంటాయి.'

అలాగే ప్రమాణంచేశారు శిష్యులిద్దరూ.

సుబ్బయ్యగారు స్వర్గారోహణం చేశారు. దక్షిణామూర్తిగారు, శరభశాస్త్రిగారు,తమ గురుపత్నిని కన్నతల్లి కన్న మిన్నగా చూసుకుంటూ... గురుకటాక్షంతో ప్రాప్తించిన గ్రంథాన్ని త్రికరణశుద్ధిగా అధ్యయనం చేశారు. సంగీత విద్యాపరిపూర్ణులయ్యారు.

కొంతకాలానికి గురుపత్ని కాలంచేశారు. ఇక, దక్షిణామూర్తి, శరభశాస్త్రులిరువురూ కావేరీతీరాన తాము నేర్చిన 'త్యాగరాజ సంప్రదాయ సంగీతం'తో స్వస్థలమైన కృష్ణాతీరానికి తిరిగి వచ్చారు. శరభశాస్త్రిగారు వేణుగాన ప్రదర్శనలు చేసి, గొప్ప విద్వాంసునిగా కీర్తి సంపాదించారు.

దక్షిణామూర్తిశాస్త్రిగారు, తెలుగునాట సత్సంప్ర దాయ సంగీత ప్రచార రథసారథి అయ్యారు. అగ్రహారీకులైన ఆయన, కులమత వివక్ష చూపక, భోజనం పెట్టి, విద్యార్థులెందరికో గురుకుల పద్ధతిలో విద్యాదానం చేశారు.

వాగ్గేయకారులు, నైష్ఠికులైన ఆయన, ఏనాడూ తన విద్యను వేదికపై ప్రదర్శించలేదు! ధనం ఆశించలేదు!!

ఈనాడు తెలుగునాట శాస్త్రీయ సంగీతం పరిఢవిల్లటానికి దక్షిణామూర్తి శాస్త్రులవారే ప్రధాన కారకులు.

'గాయకసార్వభౌమ' పారుపల్లిరామకృష్ణయ్య పంతులుగారు,వారి శిష్యులలో ముఖ్యులు. గురువుగారి మరణానంతరం, వారి అడుగుజాడలలో నడచి, బెజవాడ కేంద్రంగా గురుకులం స్థాపించి, బాలమురళీకృష్ణ, అన్నవరపు రామస్వామి, ఎన్.సి. హెచ్. కృష్ణమాచార్యులు గార్లవంటి విద్వాంసులను లోకానికందించారాయన. పంతులుగారు, త్యాగరాజ ఆరాధనోత్సవాలను, గురువుగారితో కలసి నిర్వహించేవారు. 1917లో గురువుగారు అస్తమించడంతో, సుసర్లవారి వర్ధంత్యుత్సవాలను కూడా, త్యాగరాజ ఉత్సవాలతో జతచేసి, నిర్వహించేవారు. అదే ఉత్సవాల సమయంలో పంతులుగారు 1951లో అనూహ్యంగా మరణించడంతో, వారి శిష్యులు, ప్రధానంగా అన్నవరపువారు ఆ ఉత్సవాల నిర్వహణ భారాన్ని తన భుజస్కందాలపై వేసుకొని, నేటివరకూ నిరాటంకంగా 'సద్గురువుల వర్ధంత్యుత్సవాల' పేరిట జరుపుతున్నారు. 1941 నుండీ ఈ ఉత్సవాలకు సజీవసాక్షిగా నిలచి... ఈయేడు, సుసర్లవారి 102వ, మరియు పారుపల్లివారి 68వ వర్ధంత్యుత్సవాలు బెజవాడలో అన్నవరపు రామస్వామి గురువుగారు నిర్వహిస్తున్నారు. మరి...ఆ గురుపరంపరతో 76 సంవత్సరాల అనుబంధం వారిది!! ●


**'ప్రముఖాంధ్ర' రజతోత్సవ సంచిక పుష్కల విశేషములతో అలరారేట్టు రావడంలో పరితుల తోడ్పాటు కోరుతూన్నాం.**





# భార్య - భర్త!

భార్య గురించి, భార్యాభర్తల సంబంధం గురించి మహాస్వామి వారు...

వేదము ప్రతిపాదించిన శాస్త్రకర్మలు చేసితీరవలసిందే. ఇందుకోసం మానవుడు బ్రహ్మచర్యాశ్రమము తరువాత వేరొకరి సహాయం తీసుకొనవలసిందే.

ఆ సహాయకురాలు నీకు భగవంతుడు ఇచ్చిన బహుమానం. అది ఎప్పటికి నీనుండి విడదీయలేని ఆస్తి.

ఆమె ఉపయోగం నీకు కేవలం వండిపెట్టడానికి, నీ ఇంద్రియాలకు తృప్తి నివ్వడానికి మాత్రమే కాదు. ఆమెను "ధర్మ-పత్ని", "యజ్ఞ-పత్ని" అని శాస్త్రాలు కొనియాడాయి. కేవలం ధర్మాచరణకు ఆమె భర్తతో ఉండాలి. భర్తకు అటువంటి ధర్మానురక్తి కలిగించడం ఆమె కర్తవ్యం.

ధర్మపత్నిగా ధర్మాచరణయందు ఆయన పక్కన ఉండాలి. మానవాళి సంక్షేమానికి చేసే యజ్ఞయాగాది క్రతువులందు ఆమె భర్తను అనుగమిస్తూ ఆయనకు సహాయం చెయ్యాలి.

ఆమె తన భర్తకు కేవలం వంట చేసి, అతని ఇంద్రియాలకు సుఖాన్ని ఇచ్చినా ఆమె ప్రపంచ క్షేమాన్ని కోరుకున్నట్టే. అది ఎలాగంటే ఆమె కేవలం తన భర్తకు మాత్రమే వంట చెయ్యదు. ఆమె చేసిన వంట వల్ల అతిథులు, అన్నార్తులు, పశుపక్ష్యాదులు కూడా ఆధారపడతాయి. ఇలా ఆమె వల్ల 'అతిథిసేవ' 'వైశ్వదేవము' కూడా జరుపబడతాయి.

ఆమెకు పుట్టిన పిల్లలు కేవలం తన భర్తకు ఇచ్చిన సుఖానికి ప్రతిఫలములు కాదు. ఆమె వైదిక ధర్మాన్ని పెంపొందించడానికి వారిని కంటుంది. కుమారుల పెంపకం కూడా భవిష్యత్ ధార్మిక ప్రయోజనాలకోసమే. ప్రపంచంలోని ఏ ఇతర ధర్మము వివాహ వ్యవస్థకి ఇంతటి లక్ష్యం ఆపాదించలేదు.

మన సనాతన ధర్మంలో స్త్రీపురుష సంబంధం కేవలం ప్రాపంచిక విషయ సుఖాలకోసం కాదు. ఆ పవిత్ర సంబంధం వల్ల ఆత్మోన్నతి, మానవ ఉద్ధరణ లభిస్తాయి.

వేరే మతాల్లో కూడా దేవుని సాక్షిగానే వివాహాలు జరుగుతాయి కాని మన వివాహ వ్యవస్థ అంత ఉన్నతమైన వ్యవస్థ కాదు వారిది.

మన సనాతన ధర్మంలో వివాహం, భర్తను ఉత్తమ స్థితికి తీసుకునివెళ్ళి భార్యకు పరిపూర్ణత్వాన్ని ప్రసాదించడమే.

ఇంతటి మహోన్నత వ్యవస్థ వేరే సంప్రదాయాలలో లేదు. వేరే దేశాలలో స్త్రీ పురుష సంబంధం కేవలం కుటుంబం లేదా కేవలం సామాజిక ఒప్పందం మాత్రమే.

కాని ఇక్కడ మనవారిది ఆత్మ సంబంధం. కాని ఈ సంబంధం కూడా ప్రాపంచిక విషయాలనుంచి ఆత్మను దూరం చేసి ఆత్మోన్నతి పొందేది అయ్యుండాలి. ఇందులో విడాకులు అన్న పదానికి తావు లేదు. అది తలవడం కూడా పాపమే.

మూడు ముఖ్యమైన సంస్కారములు కలగలిసి వివాహము అనే సంప్రదాయం ఏర్పడింది. మొదటిది వేదాధ్యయనం అవ్వగానే పురుషునికి ఒక తోడు, సహాయకురాలు ఏర్పాటు చెయ్యడం. ఈ తోడు కేవలం ఇంటి అవసరాలు తీర్చడం కోసమే కాకుండా పురుషుని వైదికధర్మాచరణకు తోడ్పాటునివ్వడం.

రెండవది మంచి వ్యక్తిత్వం మంచి నడవడిక గల ఉత్తమ సంతానాన్ని కనడం. వారి వల్ల ఆ వంశపు వైదిక సంస్కృతి పరిఢవిల్లుతుంది. మంచి వ్యక్తులుగా ఎదిగి సంఘానికి మేలుచేసే సంతానం అవుతారు.

మూడవది స్త్రీకి ప్రాపంచిక ఉనికినుండి విముక్తినివ్వడం. ఆత్మోన్నతి పూర్తిగా పొందని భర్తని అతని కర్మానుసారం భార్య నడిపిస్తుంది. అలా చేయడం వలన ఆమె పూర్తిగా భర్తకు అంకితమై అతనికంటే పైస్థాయిని పొందుతుంది.

నాలుగవది పైమూడు విషయాలకోసం విచ్చలవిడి ఇంద్రియ సుఖాలను అణిచివేయడం.

కాని ఇప్పుడు మనం పై మూడింటిని మరచిపోయాము. మిగిలినది నాలుగవది ఒక్కటే శారీరక సుఖం లేదా ఇంద్రియ సుఖం. ఎల్లప్పుడూ అసత్యమైన ఈ శరీరమును సుఖింపచేయడం.

మీరు నా సలహా పాటించి శాస్త్రము చెప్పిన ఉన్నతమైన ఆదర్శాలకొరకు సశాస్త్రీయ వివాహము చేసుకొన్న ఆత్మోన్నతి తప్పక పొందెదరు. చంద్రమౌళీశ్వరుడు మిమ్ము కాపాడుగాక!!! ●

# ఇంటిపేర్లతో ఇరకాటం??

## (పెళ్ళిళ్ల పేరయ్య శాస్త్రి స్వగతం)

లంకా వారి అమ్మాయిని చేసుకోమని అడివి వారికి చెవినిల్లు కట్టుకు చెప్పాను. ఉహూ ! వాళ్లకి సొక్కలా.

నాకు ఒళ్లు మండింది. త్రేతాగ్నులవారి అమ్మాయిని తెచ్చి అడివి వారికి అంటించాను.

కొంప భస్మమై పోయిందని అడివి వారి గోల. కానీ త్రేతాగ్నులవారితోనూ గోలే. అల్లుడు పాడైతే అమ్మాయి మాత్రం బాగుపడ్డట్టా? అని.

పోన్లెమ్మని ఈ సారి జలసూత్రం వారి అమ్మాయిని తెచ్చి త్రేతాగ్నుల వారి నెత్తి మీద దింపాను.

ఈ సారి కొంప ఆరిపోయిందనీ, ఇంట్లో పొయ్యి కూడా వెలగటం లేదనీ త్రేతాగ్నుల వారితో మళ్లీ గోల.

అమ్మాయికి రోజూ టెంపరేచర్ వొస్తోందని జలసూత్రం వారితోనూ గోలే.

పాపం త్రేతాగ్నుల వారి మీద జాలేసి ఈ సారి నేతి వారి అబ్బాయికి త్రేతాగ్నుల వారి అమ్మాయిని కట్టబెట్టించాను.

దీని దుంప తెగ ! త్రేతాగ్నుల వారి అమ్మాయి ధగధగా వెలిగిపోతోంది కానీ నేతి వారి అబ్బాయి బక్క చిక్కి శల్యమై పోయాడు

పప్పు వారి అమ్మాయి ఉంది. చక్కగా పచ్చని చాయతో ఉంటుంది. ఆ అమ్మాయిని తెచ్చి నేతి వారితో ముడిపెట్టాను.

మిసమిస లాడుతూ నేతి వారి అబ్బాయి, పచ్చని చాయతో పప్పు వారి అమ్మాయి హాయిగా కాపరం చేసుకుంటున్నారు.

(పైవన్నీ బ్రాహ్మల ఇంటి పేర్లు. ఈ జోక్ 25 సం: క్రితం ఆంధ్రజ్యోతిలో ధనికొండ రవిప్రసాద్ గారి చతురత )


We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

## జీ.వి. రావ్ పేజీ

సత్సంకల్పం, నిష్కాపట్యం మరియు అఖండప్రేమ అనేవి ప్రపంచాన్ని జయించగలవు.
ఈ సుగుణాలు ఉన్న వ్యక్తి లక్షలకొద్ది కపటుల, పశు సమానుల కుతంత్రాలను వమ్ము చేయగలడు.

- స్వామి వివేకానంద



(గోటేటి వేంకటేశ్వరరావు)

## ద రియల్ సూపర్ స్టార్



రజనికాంత్ సినిమాలలో అడుగుపెట్టి దరిదాపుగా 45ఏళ్ళు, 1975 లో బాలచందర్ గారిచే "అపూర్వ రాగంగళ్" చిత్రంలో ఒక 5 నిమిషాల నిడివి గల పాత్రలో పరిచయం చెయ్యబడ్డాడు. అటు పిమ్మట చిన్న చిన్న వేషాలు, విలన్ వేషం వేస్తున్న సమయంలో దేవర్ సినిమాలకు కథను అందించే కలైజ్ఞానం అనే కథా రచయిత తాను నిర్మాతగా మారి రజనికాంత్ ను హీరోగా పరిచయం చేస్తూ ఒక చిత్రాన్ని ప్రారంభించి అష్టకష్టాలు పడి ముగించి విడుదల చేశాడు. ఆ సినిమాతో రజని దశ తిరిగి పెద్ద స్టార్, ఆ పై సూపర్ స్టార్ అయ్యాడు. అలా 40 ఏళ్ళుగా ఎదురులేని హీరో గా ప్రజల హృదయాలలో నిలిచిపోయాడు. 70 ఏళ్ళ వయసులోను అదే స్టైల్, అదే క్రేజ్, ఈరోజుకీ రజని సినిమా అంటే విర్రవీగి విజృభించి పోతారు జనం, అతని పాపులారిటి మనం దేశం ఎల్లలు దాటి వెళ్ళిపోయింది. చాలమంది పిల్లలు ఆయన అభిమానులు, పసి పాపలనుండి తాతయ్య అమ్మమ్మల దాకా ఆయన పై ఎనలేని అభిమానాన్ని పెంచుకున్నారు. కొద్ది రోజుల క్రితం ఆయన్ను హీరోగా పరిచయం చేసిన కలైజ్ఞానం 80 వ పుట్టినరోజు వేడుకలకు ఆయన పిలుపునందుకుని అతిధిగా వెళ్ళారు మన సూపర్ స్టార్, ఆ సభలో నటుడు శివకుమార్ కలైజ్ఞానం వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ, ఆయన ఎవరిని సహాయం అడగడని, అంత పెద్ద రచయితా, నిర్మాత అయినా సినిమాలలో పెద్దగా సంపాదించినదేవి లేదని, ఇన్ని సంవత్సరాలు సినీ పరిశ్రమలో వున్నా ఆయనకంటూ స్వంతంగా ఒక ఇల్లు కుడా లేదని చెప్పారు, అదే సభలో నున్న రజనికాంత్ కలైజ్ఞానంగారు తనను పరిచయం చేసిన వివరాలు చెపుతూ, ఆయన ఇబ్బందుల్లో వున్నారని కాని, ఒక ఫ్లాట్ కుడా లేదన్న విషయం తనకు తెలియదని చెపుతూ, అప్పటికపుడు కలైజ్ఞానం గారిని చూస్తూ ఒక కోటి రూపాయలలో ఆయనకు నచ్చిన చోట నచ్చిన విధంగా ఇల్లు చూడమని తను ఆ డబ్బును ఇస్తానని చెప్పారు. ఒక నాలుగు రోజుల క్రితం పేపర్లలో వార్త చూసాను ఆయన ఇల్లు చూడడం, రజనికాంత్ తను ఇచ్చిన మాట ప్రకారం డబ్బు ఇవ్వడం, గృహప్రవేశం ఫోటోలు, కలైజ్ఞానంగారి కుటుంబ సభ్యుల మొహాలలోని సంతోషాన్ని చూడండి, ఎంత ముచ్చటేస్తోందో. అందుకే అన్నాను హీ ఇస్ రియల్ సూపర్ స్టార్.

ఎవరండీ ఈ కాలంలో కృతజ్ఞతా భావంతో చేసేవారు, అందుకే ఆయనపై అక్కసుతో ఎన్ని కుట్రలు కుతంత్రాలు పని చెయ్యలేదు, హేట్స్ ఆఫ్ సూపర్ స్టార్.

## తమిళనాడు తెలుగు ప్రజల సంక్షేమమే నా జీవిత ఆశయం

డాక్టర్ సి.ఎం.కె. రెడ్డిగారితో నాది 25 సంవత్సరాల పరిచయం, నాన్నగారి షష్టిపూర్తిలో మొదటి సారిగా చూశాను . అప్పటికి ఇప్పటికి ఏవి మార్పులేదు. అదే చురుకుదనం, కలుపుగోలుతనం, సామాజిక దృక్పధం. మొన్న డాక్టర్‌గారి



పుట్టినరోజును ఆయన అభిమానులు వేడుకగా జరిపారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. నారాయణస్వామి, పంచాయితి, గ్రామీణాభివృధి శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అపోలో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి మరియు తమిళనాడు రాజకీయనాయకులు, ఆయన అభిమానులు వందల సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సి ఎం కే రెడ్డిగారు ప్రసంగిస్తూ రాష్ట్రంలో నివసిస్తున్న 27 శాతం తెలుగు ప్రజల సంక్షేమమే తన ప్రధాన ఆశయమని, తెలుగు విద్యార్ధులు వారి మాతృభాషలోనేపరీక్షలు రాసే అవకాశం కొనసాగించాలని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని, తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించాలని, వీటికై తాను నిరంతరం కృషిచేస్తానని అవసరమైతే పోరాటం చేస్తానని తెలిపారు, అఖిల భారత తెలుగు సమాఖ్యలో 23 కులాలకు సమాన ప్రాతినిధ్యం నిస్తూ అందరినీ ఒకే తాటిపైకి తీసుకుని వచ్చానని, అందరు తెలుగువారు కలిసి ఐకమత్యంగా పనిచేస్తేనే మనం ఏవన్నా సాధించగలమని చెప్పారు. న్యాయస్థానాల తీర్పులన్నీ తాత్కాలిక ఊరట మాత్రమే కలిగిస్తున్నాయని, ఈ సమస్య శాశ్వత పరిష్కారం కావాలని అందుకై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ జగన్మోహన్ రెడ్డి గారిని కలిసి వివరిస్తానని ఆయన ఈ సమస్య పరిష్కరిస్తారని నమ్మకం తనకుందని చెప్పారు. ఈ వేడుకలోని సాంస్కృతిక కార్యక్రమములన్నీ ఆహుతులందరిని అలరించాయి. ●